# విద్యార్థి జ్వాల

Rs. 12/- per copy
Vol. 31 - No.12
January 2026




## కొత్త సంవత్సరంలో
## కొత్తదనం

ఎడిటోరియల్

# ఒక కొత్త అవకాశం

ఇటీవల భారత మహిళా క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఇండోర్‌కు చెందిన సంగీత దర్శకుడు పలాష్ ముచ్చాల్ పెళ్ళి చివరి నిమిషంలో రద్దయిన విషయం తెలిసిందే. ఇలా చివరి నిమిషంలో పెళ్ళి రద్దు కావడం సెలబ్రెటీస్ జీవితంలోనే కాదు సామాన్య మానవుల జీవితంలో కూడా సాధారణంగా మారుతుంది. మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన వివాహాల గురించి ప్రముఖ హిందీ దినపత్రిక దైనిక్ భాస్కర్ ఒక దిగ్భ్రాంతికరమైన పరిశోధనాత్మక కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం నవంబర్ 1 నుండి డిసెంబర్ 8 (2025) మధ్య ఇండోర్‌లో 150కు పైగా వివాహాలు లేదా నిశ్చితార్థాలు చివరి నిమిషంలో ఆగిపోయాయి. రద్దయిన వాటిలో సుమారు 62% వరకు పాత సోషల్ మీడియా పోస్ట్‌లు, ఫోటోలు, కామెంట్లు, గత సంబంధాల గురించిన సీక్రెట్ సమాచారం బయటపడడం వల్ల జరిగితే, మిగిలిన 38% కుటుంబ కలహాలు, ఆర్థిక విభేదాలు, అహంకార సమస్యలు వల్ల జరిగినవి.

లోకంలో వారి వలె విశ్వాసుల వివాహాలు చివరి నిమిషంలో ఆగిపోవడం జరగకపోవచ్చు కానీ, కొంతమంది వివాహానికి ముందు, కొంతమంది వివాహమైన తర్వాత రహస్య జీవితాన్ని జీవిస్తున్నారు. మరికొందరు ఆత్మీయతలో తగ్గి కుటుంబ కలహాలు, ఆర్థిక విభేదాలు, అహంకార సమస్యల వల్ల తమ కుటుంబాల్లో సమాధానం లేకుండా నరకప్రాయం చేసుకొంటున్నారు.

పాపం రహస్యంగా మొదలై బహిరంగ అవమానాన్ని తీసుకు వస్తుంది. దేవునికి మరుగైనదేదీ లేదు, ఆయన ప్రతి రహస్యాన్ని గమనిస్తూ ఉంటాడు (కీర్తన 139:11,12). ఇది సంసోను, దావీదు, ఆకాను మొదలగు వారి జీవితాల్లో సుస్పష్టం. "భూలోకంలో మనం రహస్యంగా చేసే పాపం, పరలోకంలో ఒక బహిరంగ కుంభకోణంలా కనిపిస్తుందని" ఒక భక్తుడు అంటాడు. నేటి సంఘాల్లో, సంస్థల్లో రహస్య పాపాల వల్ల ఎందరో పతనమయ్యారు, తమ సాక్ష్యాన్ని పోగొట్టుకొన్నారు. దేవుడు మెచ్చని ఈ అనైతిక సంబంధాలు, ప్రేమల విషయంలో విశ్వాస విద్యార్థులు, యంగ్ గ్రాడ్యుయేట్స్ జాగ్రత్తగా ఉండాలి. అలాగే పాత జీవితానికి సంబంధించిన ఆలోచనలు, అలవాట్లు, ఆవేశాలు, అహంకారాలు ఏమైనా ఉంటే వాటిని ఈ కొత్త సంవత్సరంలో సరి చేసుకొందాం, నూతన జీవితాన్ని ప్రారంభిద్దాం.

నేటి ప్రపంచం కొత్త జీవితం కోసం 'ఫ్రెష్ స్టార్ట్ ఎఫెక్ట్' అనే భావనను పరిచయం చేసింది. అంటే, ప్రజలు తమ జీవితాల్లో మార్పులు చేసుకోవడానికి కొన్ని 'సమయ మైలురాళ్లను' ఎంచుకోవడం. ఉదా: కొత్త సంవత్సరం, పుట్టినరోజులు, లేదా ఒక కొత్త నెల ప్రారంభం వంటి సమయాల్లో మనిషికి సహజంగానే తన పాత వైఫల్యాల నుండి దూరంగా జరిగి, కొత్తగా జీవించాలనే, ఏదైనా చేయాలనే, సాధించాలనే ప్రేరణ కలిగి తమ గతాన్ని ఒక పాత అధ్యాయంగా మూసివేసి, వర్తమానాన్ని ఒక 'క్లీన్ స్లేట్'గా భావించి ప్రారంభిస్తారు. ఈ ప్రారంభాలు తాత్కాలికం కావడమే దీని ప్రధాన లోపం. కొత్త సంవత్సరం రోజున తీసుకునే తీర్మానాలు ఫిబ్రవరి నాటికే మసకబారి పోతాయి. అలాగే, ఇది మనిషి యొక్క మూల స్వభావంలో మార్పును తీసుకొని రాలేదు.

క్రైస్తవ్యం చెప్పే నూతనత్వం కేవలం క్యాలెండర్ మీద, వివిధ రోజుల మీద ఆధారపడదు, అది దేవుని వాక్యము, పరిశుద్ధాత్మ శక్తి మీద ఆధారపడి ఉంటుంది. పాపంతో, అసత్యంతో సంబంధం ఉన్న ప్రతి ఆలోచనా విధానం, దృక్పథం, నమ్మకాలు తీసివేసి వాటి స్థానంలో ప్రతిదినం దేవుని వాక్యం చదివి, ధ్యానించి దాని ప్రకారం జీవిస్తూ ఉంటే నూతనత్వం సాధ్యమవుతుంది. మనం దేవుని వాక్యానికి ఎంతగా లోబడతామో అంతగా పరిశుద్ధాత్ముడు మనలో కార్యం చేస్తూ పాత జీవితాన్నుంచి విడిపించి మనల్ని నూతనమైన వారిగా చేస్తాడు.

పాత మనసు వెనకటి జ్ఞాపకాలను మరువదు (నిర్గమ16:2-3,17:3), ప్రతికూల ఆలోచనా ధోరణి (నెగిటివ్ థింకింగ్) కలిగి ఉంటుంది (నిర్గమ 14:17), మనుష్యుల సంగతుల్నే తలస్తుంది (మత్తయి 16:21-23), చింతిస్తూ ఆందోళన చెందుతుంది (లూకా 10:40,41), కీడుచేసే విమర్శనాత్మక ధోరణి, సంకుచిత మనస్తత్వం కలిగి ఉంటుంది, ప్రతి దానికీ లెక్కలు కడుతూ డబ్బు కోణంలో ఆలోచించడం (యోహాను 12:4-5), హెచ్చువాటిమీద (రోమా 12:16), భూసంబంధమైన వాటిమీద దృష్టి ఉంచుతుంది (ఫిలిప్పి 3:19). ఇలాంటి అనేక రకరకాల పాత మనస్తత్వాల నుండి, అపవిత్ర నుండి విశ్వాసి మనసు నూతనమవ్వాలి.

"కొత్త సంవత్సరం అంటే ప్రతి మనిషికి తన పాత అలవాట్లను, ఆలోచనలను వదిలించుకోవడానికి దొరికే ఒక కొత్త అవకాశం." అని అంటాడు మార్క్ ట్వైన్. మనం గతాన్ని పట్టుకుని వేలాడితే, దేవుడు ఇచ్చే కొత్తదనాన్ని అందుకోలేము. మనం క్రీస్తులో ఉంటే ప్రతి రోజూ కొత్తే, ఆయన లేకపోతే ప్రతి సంవత్సరం పాతదే! తేదీ మారితే కాలం మారుతుంది, కానీ తలంపులు మారితేనే జీవితం మారుతుంది!

*నూతన సంవత్సర శుభాకాంక్షలతో...*

– **పి. సునీల్ జాకబ్,** ఎడిటర్




Vol. 31, No. 12. January 2026
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:
Mr. R. Srinivasa Rao - Publisher
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., PT
Mr. P. Ramaswamy - Sec., Lit.Dept.

SUBSCRIPTION CHARGES:
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Years) - Rs. 400
GRADUATES (3 Years) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:
The prescribed subscription charges can be paid using the account / UPI ID / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**

**Account No : 43362371247,**

**SBI Nambur Branch**

**IFSC: SBIN0011994**

**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**

**UPI ID : uesiptap@sbi**

CONTACT:
The Editor
Vidyardhi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com




## కొత్తసంవత్సరంలో
# కొత్తదనం

"ప్రతిరోజూ ఒక కొత్త రోజు
ముందెన్నడూ రాలేదు ఈ రోజు
మరెన్నడూ రాబోదు ఈ రోజు
ప్రత్యేకమైన కొత్త రోజు
ఆనందముగా జీవించాలి ఈ రోజు
క్రీస్తు కొత్తదనము ధరించాలి ప్రతి కొత్త రోజు
ప్రతి కొత్త రోజూ ప్రభువుకు మహిమే..."

అని పాడుకొంటూ, దేవా! ఈ నూతన సంవత్సరంలో నన్ను నూతన పరచుము, నీ నూతన కార్యాలు నా యెడల జరిగించుమని ప్రతిరోజూ ప్రార్థన చేసుకొంటూ, ప్రతిరోజూ ప్రభువుకు లోబడుతూ, కొత్తదనంతో జీవిస్తూ ఈ సంవత్సరమంతా సాగిపోదాం.

విద్యార్థి జ్వాల పాఠకులందరికీ

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

## లోపలి పేజీల్లో...

- ఒక కొత్త అవకాశం - 2
- నూతన సంవత్సరం - నూతన ఉత్సాహం - 4
- కొత్త సంవత్సరంలో కొత్తదనం - 5
- అడుగు ముందుకు వేద్దాం - 9
- క్రీస్తు కేంద్రిత జీవితం - 11
- మంచి ముగింపు - 15
- ఆరోగ్యంగా జీవిద్దాం -20
- ఈ సంవత్సరం కూడా ఉండనిమ్ము!! - 24
- క్రీస్తు మనసు - సహవాసంలో ఐక్యత - 26
- క్రైస్తవ దాతృత్వం - 27
- రాణించడానికి 5 సూత్రాలు - 31
- జీవితం అల్పమైనది - 32

# నూతన సంవత్సరం నూతన ఉత్సాహం

'పిల్లలు కాదు పిడుగులు' వయసులో చిన్నవారు అసాధారణమైన పనులు చేసినప్పుడు మనం వాడే డైలాగ్. పట్టుదలతో, ప్రేమించిన పని చేయడానికి వయసుతో సంబంధం లేదని 22 ఏళ్ళ కెన్యా పర్యావరణ కార్యకర్త ట్రంఫెనాముతోని 72 గం॥లు సేపు చెట్టును కౌగిలించుకొని ఉండి ప్రపంచ రికార్డ్‌ను స్థాపించడం మనకు స్పష్టం చేస్తుంది.

ఆయా రంగాల్లో ఆసక్తి గలవారు వారి వయసుతో సంబంధం లేకుండా వివిధ రంగాల్లో ప్రగతి సాధిస్తూనే ఉన్నారు. ఈ విషయం మనల్ని ఎంతో ప్రోత్సహించాలి. తాను అనుకున్న, ఎన్నుకొన్న రంగంలో (దేవుడే ఈ రంగాన్ని ఎన్నుకొనేలా చేశారు) అత్యున్నత స్థానానికి వెళ్ళాలని పౌలు వెనకున్నవి మరచి ముందున్న వాటి కొరకు వేగిర పడుచూ క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానం పొందవలెనని గురి యొద్దకే పరుగు కొనసాగించాడు. ఇది అత్యంత శ్రేష్టమైన రంగమే కాకుండా నిత్యత్వ విలువలు కలిగిన రంగం. ఈ సత్యాన్ని ఎప్పుడో గ్రహించిన మనం ఈ నూతన సంవత్సరంలో కూడా నూతన ఉత్సాహంతో కొనసాగించాలి. ఏదైనా కారణం చేత గురి యొద్దకు కొనసాగే పరుగు నెమ్మదిగా ఉన్నా, నిరాశాజనకంగా ఉన్నా, ప్రభువు ఇచ్చే ప్రేరణతో మరింత ఉత్సాహంగా కొనసాగించాలి. అపజయం అంతిమం కాదు గనుక మనం విజయపథంలో కొనసాగుతూనే ఉండాలి.

*ఒక్కొక్కటే నాలో*
*విచ్చుకుంటున్న వెలుతురు కోణాలను*
*తనివితీరా ఆత్మకు హత్తుకొంటాను*
*మూక్కుమ్మడిగా*
*నా మీద విరుచుకుపడే*
*చీకటి బాణాల మీద*
*మెరుపు యుద్ధం ప్రకటిస్తాను*
*అలవాటుగా మారిన*
*అపజయాల దొంతరల మీద*
*వాక్యఖడ్గంతో విజయసంతకం చేస్తాను !*

*శరీరమంతా చుట్టుకున్న*
*సుషుప్తిలోంచి మేల్కొని*
*చేతులారా చుట్టూ పేర్చుకున్న*
*చెత్తనంతా విదిలించుకొని*
*సీతాకోకచిలుకల్లే*
*రంగుల ప్రపంచంలోకి*
*నా రెక్కల్ని ఎగరేస్తాను*
*అపజయం గుండెలమీద*
*గెలుపు జెండానై ఉదయిస్తాను !* (తాళ్ళూరి దృక్పథం)

అత్యంత శ్రేష్టమైన, నిత్యత్వపు విలువలతో కూడిన ఈ రంగంలో ముందుకు వెళ్ళే ప్రక్రియలో పట్టు విడువక పరుగెడుదాం. పిల్లలు కాదు పిడుగులు అనే నానుడితో పాటు పెద్దలు కూడా పిడుగులే అని స్థాపించి, నిరూపిద్దాం. తనకున్న అకుంఠిత దీక్ష వలన పౌలు ప్రభువు కొరకు పిడుగులా మారాడు. ప్రభువుని అనుసరించే ప్రక్రియలో మనం కనీసం పౌలులా మారాల్సిన అవసరం ఉంది. వయసుతో సంబంధం లేకుండా మనం ఎంచుకొన్న ఈ శ్రేష్టమైన రంగంలో పయనిద్దాం. ట్రంఫెనా పర్యావరణ సంరక్షణ గూర్చి తనలాంటి యువతీ యువకులు శ్రద్ధ తీసుకోవాలని శపథం చేస్తే, మనం – మనలాంటి వాళ్ళు ప్రభువు ఆశించిన మార్గంలో, ఆయన ఆశించిన విధానంలో వెళ్ళడానికి ప్రోత్సహిద్దాం. ఇలాంటి దృక్పథంతో ఈ నూతన సంవత్సరంలో నూతన ఉత్సాహంతో కొనసాగుదాం. ఆయన హృదయంలో సంతోషాన్ని నింపుతూ కొనసాగుదాం.

ఆయన ప్రణాళికలో మీ....

**ఆర్. శ్రీనివాస్**
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు




## కొత్త సంవత్సరంలో
# కొత్తదనం

మరో క్రిస్మస్ గడిచిపోయి కొత్త సంవత్సరం వచ్చేసింది. ఇప్పుడు మనం 2026 సం॥లో ఉన్నాం. ఈ నూతన సంవత్సరం మనకు కొత్త సదవకాశాల్ని, కొత్త సమస్యల్ని సరిసమానంగా తెస్తుంది. యేసయ్య తన శిష్యులకు "ఈ లోకంలో, మీకు శ్రమ ఉంటుంది" (యోహాను 16:33) అని హెచ్చరించారు. అనేక సందర్భాల్లో ఇది మన అనుభవం కూడా. కొన్ని కుటుంబాలు ఈ క్రిస్మస్ సమయంలో, కొత్త సంవత్సరంలో నూతన శిశువులను స్వాగతించగా, మరికొందరు తమ ప్రియమైన వారికి కన్నీటితో వీడ్కోలు పలికారు. యోహాను 16:33 లోనే యేసయ్య శ్రమ, ఇబ్బంది, కష్టాలు ఉంటాయని చెప్పేముందు యేసయ్య ఇచ్చే సమాధానం గూర్చి కూడా వాగ్దానం చేశాడు. ఆయన లోకమును జయించియున్నాడు కనుక క్లిష్ట పరిస్థితుల్లో, అన్ని విషయాలలో ధైర్యము తెచ్చుకొని ముందుకు సాగిపొమ్మన్నాడు. ఈ కొత్త ఏడాదిలో నూతన ధైర్యముతో, నిబ్బరంతో, నిరీక్షణతో, కృతజ్ఞతతో, విశ్వాసంతో సంవత్సరాది మొదలు సంవత్సరాంతం వరకు నూతనత్వంతో దేవునిలో ఎలా ముందుకు సాగిపోవచ్చో చూద్దాం.

### కొత్త సంవత్సరం - దేవుని బహుమానం

తెగులు, వేదనలు మరణ శాసనమై, గడచిన దినములు గాఢాంధకారమై జరుగుచుండగా, సంవత్సరాలు దిగులుతో దొర్లుచుండగా, 'క్రొత్త యేడు మొదలుబెట్టెను మన బ్రతుకునందు' అనే పాతపాటను అలవాటుగా పాడుకొంటూ కొత్త సంవత్సరంలోకి ఉదాసీనంగా వచ్చేశామా? లేక నూతన సంవత్సరాన్ని దయా కిరీటంగా మనకు అనుగ్రహించిన దేవుని కృపలను జ్ఞాపకం చేసుకొంటున్నామా?

మన జీవితంలో వచ్చే ప్రతి నూతన సంవత్సరం దేవుని వరమే. కొత్త సంవత్సర బహుమతిగా 'కొత్తదనం' (న్యూనెస్) అనేది కూడా దేవుని బహుమానం, వాగ్దానము అని బైబిల్ మాట్లా డుతుంది. విలాపవాక్యాలు 3:22-23లో మన పట్ల 'దేవునికి అనుదినము నూతనముగా వాత్సల్యత పుట్టుచున్నది' అనే మాటను చూస్తాము. అంటే తమ బిడ్డలపట్ల తల్లిదండ్రులకు ఎలాంటి ప్రేమ ప్రతిరోజూ పుడుతుందో అలాంటి ప్రేమే దేవునికి మనపట్ల కలుగుతుంది. కుల, మత, సంఘ, సహవాసం, పేద, గొప్ప, పండితులు, పామరులు, లింగ వివక్ష లేకుండా అందరికీ దేవుడు నూతన సంవత్సరాన్ని బహుమానంగా ఇచ్చాడు. నూతన సంవత్సరం 'దేవుడు ధరింపచేసిన దయా కిరీటము' (కీర్తనలు 65:11) అని కీర్తనకారుడు అంటాడు.

### కొత్తదనం అంటే?

చేసిన పనినే చేస్తూ, చూసిందే చూస్తూ,

జీవితంలో ఉన్నచోటే ఉంటూ ఎప్పుడూ ఒకేలా ఉంటే విసుగొస్తుంది, అది జీవితమే కాదనిపిస్తుంది. జీవితం అన్నాక కొంతైనా మార్పు, కొత్తదనం ఉండాలి. కొత్త వస్త్రాలు, కొత్త వస్తువులు, కొత్త ఇల్లు, కొత్త పరిచయాలు, కొత్త అవకాశాలు, కొత్త విషయాలు అంటే మనకు ఎంతో అపురూపం, ఆశ్చర్యం, ఆనందం. మనమందరమూ కొత్తదనాన్ని కోరుకుంటుంటాము! కానీ 'నూతనత్వం' అనే అంశాన్ని మనమెలా అర్థం చేసుకోవచ్చు? 'నూతనత్వం అంటే నూతన సంవత్సర తీర్మానాల తో మన జీవితంలో వచ్చే చిన్న చిన్న మార్పులు కాదు కానీ జీవితంలో పూర్తి పరివర్తన' అని బైబిల్ చెబుతున్నది. గొంగళి పురుగు అందమైన సీతాకోకచిలుకగా రూపాంతరం చెందడం లాంటిది. అలాగే దేవుడు మనుష్యులను యేసు క్రీస్తులో నూతన పరుస్తాడు. నూతనత్వానికి పునాది దేవుని నూతన సృష్టి కార్యం. పౌలు మాటలలో "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను, ఇదిగో సమస్తమును కొత్తవాయెను" (2 కొరింథీ 5:17). క్రీస్తులో విశ్వాసముంచి, క్రీస్తు నందు ఉన్న వారెవరైనా సరే నూతన సృష్టి, అంతా నూతనమే, పాతదనము గతించింది.

నూతన జీవము పొందాము కాబట్టి నూతనత్వంలో నడుచుకోవాలి (రోమా 6:4). అయితే నీవు క్రీస్తు నందు ఉన్నావా? ఉంటే ఈ కొత్త సంవత్సరమంతా – 12 నెలలు, 52 వారాలు, 365 రోజులు, 8,760 గంటలు, 5,25,600 నిమిషాలు, 3,15,36,000 సెకన్లు అంతా కొత్తదనమే, కొత్త జీవమే, కొత్త సృష్టే. ఆహా మనకు ఎంత భాగ్యము! ఈ భాగ్యముతో పాటు దేవుడు మనల్ని ఈ సంవత్సరమంతా నూతనత్వంలో నడుచుకోవాల్సిన బాధ్యతను కూడా ఇచ్చాడు.

## కొత్తదనం ఏయే విషయాల్లో

క్రీస్తులో నూతన సృష్టిగా చేయబడినవారికి అంతా, అన్ని విషయాలు నూతనమే అంటే ఏంటో తెలుసుకోవాలి.

**కొత్త వ్యక్తులం** – యేసుక్రీస్తును విశ్వసించే ప్రతి వ్యక్తి ఒక కొత్త సృష్టి. కొత్త వ్యక్తిగా జీవితంలో కొత్త దిశ, కొత్త ఆశయాలు, కొత్త ఆశ, కొత్త జీవితం...! విశ్వాసికి అన్నీ కొత్తవే!

> **"**
>
> **2025వ సం॥ మీకు సక్సెస్‌ని, సంతృప్తిని, సంతోషాన్ని అందించినా లేదా మీరు అపజయాలు, దు:ఖం, ఎదురు దెబ్బలు, కష్టాలు, మరణాలను ఎదుర్కొన్నా, మీరు ఈ 2026 నూతన సంవత్సరంలో నిరీక్షణతో, ఆదరణతో, ప్రభువునందు ఆనందంతో ప్రభువైపు చూస్తూ ఈ జీవిత యాత్రలో సాగిపోవాలి.**

**కొత్త భవిష్యత్** – అక్షయమైన స్వాస్థ్యము, శాశ్వతమైన భద్రత కలిగిన భవిష్యత్ మనకు ఉంది.

**కొత్త ఆహారం** – భౌతిక ఆహారం కాదు, ఆత్మీయ ఆహారం. కొత్త ఆకలి, ఆకలిలో మార్పు (1పేతురు 2:3) దేవుని వాక్యము పట్ల ఆకలి దప్పులు కలిగి ఉంటాం.

**కొత్త విశ్వాసం** – అవసరాలు తెలిసిన దేవునినే సహాయం కోసం అడుగుతూ, ఆశ్రయిస్తాం. ఆయన ప్రార్థన వింటాడని, జవాబు ఇస్తాడని దేవుని విశ్వసిస్తాం.

**కొత్త కుటుంబం** – "తిరిగి జన్మించాం" (దత్తత ద్వారా మార్పు) యేసుక్రీస్తును విశ్వసించడం ద్వారా దేవుని కుమారులం (గలతీ 3 :26), అబద్ధికుని పిల్లలం కాదు కానీ దేవుడే మన తండ్రి, దేవుని కుటుంబానికి చెందినవారం (గలతీ 4, ఎఫెసీ 3:14)

**కొత్త సహవాసం** – సరికొత్త సంబంధాలు, స్నేహాలు, సాంగత్యాలు, సహవాసాలు దేవునితో, దేవుని బిడ్డలతో ఏర్పడ్డాయి. బంధాలు, అనుబంధాలలో మార్పు వచ్చింది. "మోసపోకుడి. దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును. (1 కొరింథీ 15:33). ఈ లోక స్నేహము, లోకరీతిలో కలిసిపోవడం కొత్తదనానికి పాతదనం అతకటమే. అది దేవునితో వైరమని గుర్తుంచుకోవాలి.

**కొత్త యజమాని /గురువు** – విశ్వాసికి ఒకే ఒక గురువు ఉన్నాడు. ఆయన ప్రభువైన యేసుక్రీస్తు (మత్తయి 23:8-10). మన యజమానుడు,

గురువునైన క్రీస్తుకు నూతన వినయము, విధేయత చూపాలి. చాలామంది విశ్వాసులు అవకాశవాదులుగా ఉంటూ పాత, కొత్త యజమానుల్ని ఇంకా సేవిస్తూనే ఉన్నారు. ప్రభువైన యేసు ఇలా అన్నాడు: "ఎవడూ ఇద్దరు యజమానులకు సేవ చేయలేడు" (మత్తయి 6:24). మనము మన సంపూర్ణ విధేయతను ప్రభుక్రీస్తుకే చూపుదాం.

**కొత్త ఫలం** – కొత్త జీవితానికి గుర్తు ఆత్మ ఫలాన్ని (గలతీ 5:22) ఫలించటం, ఆత్మీయ వరాల్ని ప్రదర్శించడం కాదు – వైఖరిలో మార్పు రావాలి.

**కొత్త పోరాటం** – కొత్త శత్రువు మనకు ఉన్నాడని గుర్తుంచుకోవాలి. దైవభక్తిగల ప్రతి నూతన విశ్వాసికి ముగ్గురు ప్రాథమిక శత్రువులు ఉంటారు–సాతాను, లోకము, శరీరము. ఈ పోరాటంలో ఓడిపోక, శోధనలకు లొంగిపోక, పౌలువలె శరీరాన్ని నలగకొట్టుకొంటూ, ట్రయల్స్ (పరీక్షలను) ఓపికతో సహిస్తూ, ట్రిబ్యులేషన్స్ (శ్రమలను) సంతోషముగా ఎదుర్కొంటూ దేవుని సహాయంతో విజయభేరిని మోగించాలి.

కొత్త జీవితానికి అంతా కొత్తే. కొత్త మనసు–కొత్త దృక్పథం, కొత్త హృదయం–కొత్త కోరికలు, కొత్త ఆత్మ–కొత్త స్వభావం, కొత్త భావోద్వేగాలు, కొత్త గమ్యాలు, సరికొత్త సాహసాలు ప్రభు కొరకు జీవితంలో కొత్తదనం అనుభవించాలంటే నూతన సంవత్సరంలో క్రీస్తు యొక్క నూతనత్వాన్ని స్వీకరించడంలోనే జీవితంలో కొత్తదనం అనుభవించటానికి రహస్యం. ఈ అనుభవం కావాలంటే దేవుని ప్రమేయం, పనితో పాటు మానవ ప్రయత్నం, ప్రయాస కావాలి.

## దేవుని ప్రమేయం

నూతనత్వం దేవుని వాగ్దానం, నూతనక్రియ. 'ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను ఇప్పుడే అది మొలుచును మీరు దాని నాలోచింపరా?', అని ప్రవక్త ద్వారా దేవుని ప్రకటనను (యెషయా43:18–19) మనం వింటాము. కాలము సంపూర్ణమైనప్పుడు క్రీస్తు ప్రభువు ఈ లోకానికి వచ్చి సిలువ మరణము, రక్త ప్రోక్షణ ద్వారా క్రీస్తునందలి నూతనత్వాన్ని అనుగ్రహించాడు. ఇది దేవుని అనుగ్రహమే. పాత సంగతులు గతించి పోయెనని, సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని, అంతిమ నూతన సృష్టిని గూర్చి దేవుడు యోహాను ద్వారా వాగ్దానము (ప్రక 21:5) చేశాడు. పాత రోత సంతతిని పాతిపెట్టాలని క్రీస్తులోని కొత్తదనంతో జీవించాలని దేవుని ఆజ్ఞ.

## మన అనుభవము

దావీదు నాశనకరమైన గుంటలో నుండి, జిగటగల దొంగ ఊబిలో నుండి దేవుడు పైకి లేవనెత్తాడని తన పాత బ్రతుకు గురించి రాసుకొన్నాడు. అంతే కాదు, క్రొత్త పాటను దేవుడు తన నోట నుంచెను అని, అనేకులు దాని చూచి భయభక్తులు గలిగి యెహోవాను నమ్ముతారని తన క్రొత్తదాన్ని పాడాడు (కీర్తన 40వ అధ్యాయం). సమరయ స్త్రీ తన పాత రోత చేష్టలన్నీ మాని నూతన జీవితాన్ని ప్రారంభిస్తానని ఊరంతా చాటింది (యోహాను 4 వ అధ్యాయం). ఇలా పేతురు, పౌలు మరెందరో.. ఈ తరములో మనందరి అనుభవం కూడా ఇదే.

## మన పాత్ర

కొత్తదనం దేవుని పని, మన అనుభవం అయినా మనము ప్రేక్షకులం కాదు, ప్యాసివ్ అంతకంటే కాదు. కొత్త, పాత జీవితానికి మధ్య ఎంతో పోరాటం, సంఘర్షణ ఉంటుంది. కొత్తదనాన్ని కలిగివుండడం, దానిలో కొనసాగేందుకు విశ్వాసులు దినదినం ఎంచుకోవాలి. మనము ఎంతో జాగ్రత్తగా, ప్రార్థనతో, వాక్య ధ్యానంతో, పరిశుద్ధుల సహవాసంతో, పరిశుద్ధాత్మానుసారముగా నడుచుకొంటూ, ఆత్మ చేత నడిపింపబడుతూ, ఆత్మననుసరించి జీవిస్తూ ఉన్నప్పుడు పాత రోతను చంపి, పాతి పెడుతూ కొత్తదనాన్ని ధరించుకొంటాము. ఒక రోజులో జరిగే పని కాదు, ప్రతిరోజు, సంవత్సరమంతా, ఈ లోకంలో మనం జీవించినంతకాలం, ప్రభువు వచ్చే వరకు ఈ నూతనత్వాన్ని ధరించుకొని దానిని అనుభవించాలి.

## విడిచి పెట్టాల్సినవి - ధరించుకోవాల్సినవి

నూతనత్వంలో నడవడానికి పాతజీవితాన్ని విడిచిపెట్టి, కొత్త జీవితాన్ని ధరించుకోవాలి. పౌలు పత్రికలలో (ఎఫెసీ 4:22–24; కొలస్సీ 3:9–10, ఫిలిప్పీ 3:13–14) క్రీస్తులో నూతనత్వం గూర్చి బోధించాడు. కొలస్సీ పత్రికలో నూతనపరచబడుతున్న నూతన స్వభావము ధరించుకొన్నారు అని, ఎఫెసీ పత్రికలో నూతన స్వభావము ధరించుకోవాలని స్పష్టముగా వివరించాడు.



పాతచొక్కా పారేసి కొత్త చొక్కా వేసుకోవాలనే పోలిక సూచించాడు. ఈ క్రమంలో వదిలిపెట్టాల్సినవి, ధరించుకోవాల్సిన వాటి గూర్చి తెలుసుకొందాం

## వేటిని విడిచిపెట్టాలి?

మోసకరమైన దురాశవలన చెడిపోయే ప్రాచీనస్వభావాన్ని, మంటినుండి పుట్టినవాని పోలికను, సకలమైన దుష్టత్వాన్ని, మోసకరమైన దురాశవలన చెడిపోయి పాతస్వభావముతో ఉన్న మురికిని పాత చొక్కా తీసి పారేసినట్లు పారేసి, పాతిపెట్టాలి.

కోపము, క్రోధము, ఆగ్రహము, సమస్తమైన ద్వేషము, దూషణ, దుర్భాష, బూతులు, పోకిరి మాటలు, డంబాలు, గొప్పలు, అల్లరి, ముసలమ్మ ముచ్చట్లు, దుష్ట సాంగత్యము-చెడు స్నేహాలు, సహవాసాలు, సంబంధాలు, అక్రమ సంబంధాలు - వివాహానికి ముందు, వివాహేతర సంబంధాలు, అమ్మాయిలు-అమ్మాయిలు, అబ్బాయిలు-అబ్బాయిలు మధ్య ఉండే అవాంఛనీయ సంబంధాలు, లైంగిక వికారాలు, కామ, క్రోధ, మద, మాత్సర్యాలు, కలహములు, సోమరితనం, దొంగిలించడం, ఒకనితో ఒకడు అబద్ధాలు, సణుగుడు, సంశయాలు, నటన, పైపై భక్తి, అపవాదికి చోటు ఇవ్వడము, పరిశుద్ధాత్మను దు:ఖపెట్టడం.. మొదలైన వాటన్నిటినీ విసర్జించాలి.

## వేటిని ధరించుకోవాలి?

నీతియు, యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీనస్వభావమును ధరించుకోవాలనే ఆజ్ఞకు అనుగుణంగా క్రీస్తు ఇచ్చే అందమైన రంగు రంగుల శుభ్రమైన, పాతబడని నిత్య నూతన కొత్త చొక్కాను ధరించాలి. అలాగే దేవునిగూర్చిన జ్ఞానము, పరలోకసంబంధి పోలిక, ప్రభువు పనియందు ఆసక్తి, నూతనపరచబడిన చిత్తము, జాలిగల మనస్సు, కరుణాహృదయం, దయాళుత్వము, దీర్ఘశాంతము, వినయము, సాత్వికము, నీతి ప్రవర్తనను ధరించుకోవాలి.

ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాట్లాడాలి, క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలకాలి, ఎదుటివారు హానిచేసినా ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు ప్రభువు మనల్ని ఎలా క్షమించాడో అలా క్షమించాలి. ఒకని యెడల ఒకడు దయకలిగి ఉండాలి. వీటన్నిటిపైన పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను కలిగి ప్రతిరోజు ప్రభువులో కొత్తగా జీవించాలి.

2025వ సం॥ మీకు సక్సెస్‌ని, సంతృప్తిని, సంతోషాన్ని అందించినా లేదా మీరు అపజయాలు, దు:ఖం, ఎదురు దెబ్బలు, కష్టాలు, మరణాలను ఎదుర్కొన్నా, మీరు ఈ 2026 నూతన సంవత్సరంలో నిరీక్షణతో, ఆదరణతో, ప్రభువునందు ఆనందంతో ప్రభువైపు చూస్తూ ఈ జీవిత యాత్రలో సాగిపోవాలి. ఎందుకంటే." నేను మిమ్మునుగూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయా 29:11) అని దేవుడు వాగ్దానం చేశాడు.

దేవా! ఈ నూతన సంవత్సరంలో నన్ను నూతన పరచుము, నీ నూతన కార్యాలు నా యెడల జరిగించుమని ప్రతిరోజు ప్రార్థన చేసుకొందాం.

"ప్రతిరోజు ఒక కొత్త రోజు
ముందెన్నడూ రాలేదు ఈ రోజు
మరెన్నడు రాబోదు ఈ రోజు
ప్రత్యేకమైన కొత్త రోజు
ఆనందముగా జీవించాలి ఈ రోజు
క్రీస్తు కొత్తదనము ధరించాలి ప్రతి కొత్త రోజు
ప్రతి కొత్త రోజు ప్రభువుకు మహిమే..."

అని పాడుకొంటూ, ప్రార్థనచేసుకొంటూ కొత్తదనంతో జీవిస్తూ ఈ సంవత్సరమంతా సాగిపోదాం.

**- డా. జె. రత్నగ్రేస్,** వైజాగ్



# అడుగు ముందుకు వేద్దాం

నూతన సంవత్సరం వచ్చింది, నూతన సందడి తెచ్చింది అన్నట్లు – ఇంట్లో పిల్లలు నూతన వస్త్రాలు ధరించి, అమ్మపెట్టే పండగ పప్పులు తింటూ బిజీ బిజీగా అల్లరి చేస్తూ ఉంటారు. యువకులు వాట్సాప్, ఫేస్‌బుక్‌ల్లో నూతన సంవత్సర మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు చూస్తూ లైక్‌లు కొడుతూ సందడి సందడిగా ఉంటారు. అమ్మానాన్నలు నూతన బైబిల్స్‌ని పట్టుకుని కుటుంబ సమేతంగా చర్చ్‌కి వెళ్ళాలనే హడావుడిలో ఉంటారు. వయస్సు పైబడిన వారు అందరికీ అన్నీ అందాయా? అని చూచుకుంటూ పిల్లల సంతోషమే వారి సంతోషంగా భావించుకొని, గతాన్ని జ్ఞాపకం చేసుకొని 'దేవా! అంతా నీదేనయ్యా' అని దేవునికి కృతజ్ఞత చెప్పుకొంటారు. ఇంకా కొంతమంది, పాస్టర్లు పంచే కొత్త సంవత్సర వాగ్దానాల కార్డులు తీసుకొని సంబరపడి పోతుంటారు. ఇలా కొత్త సంవత్సర సందడి ముగిస్తారు.

అలా ముగించకుండా ఈ నూతన సంవత్సర సందడి 365 రోజులు కొనసాగించాలంటే, నూతన నిర్ణయాలు/తీర్మానాలు తీసుకోవాలి. వాటి అమలు కొరకు ప్రణాళికా బద్ధంగా ముందుకు అడుగులు వేస్తే నూతనత్వం సంవత్సరమంతా ఉంటుంది. నూతనత్వం కోసం...

### 1. బంధాలను పెంచుకుందాం

నేను డాక్టర్‌ని, టీచర్‌ని, ఇంజనీర్‌ని అని చేసే పనిని బట్టి గాక దేవుని బిడ్డను, నా తల్లిదండ్రులకు కుమారుణ్ణి, పిల్లలకు తండ్రిని, భార్యకు భర్తను, స్నేహితులకు మంచి స్నేహితుణ్ణి అని బంధాలు పెంచుకోవాలి. ఎవరి అపార్ట్‌మెంట్‌లో వారు ఉన్నట్లుగా మనకు మనమే గిరిగీసుకుని ఉంటే బంధాలు పెరగవు. అసలు క్రైస్తవ్యం అంటే సమిష్టి జీవన విధానం. ఈ సంవత్సరం నీ సహోదరుని/సహోదరి కొరకు మొదటి అడుగువేసి, బంధాన్ని పెంచుకొని సేవ ప్రారంభిద్దాం.తర్వాతనే బలిపీఠం దగ్గరకు చేరదాం (మత్తయి 5:23,24).

### 2. ప్రేమను పంచుకుందాం

మన విశ్వాసం మనల్ని దైవ ప్రేమికులుగా మార్చాలి. ఎంతటి నీచులనైనా ప్రేమించి, సువార్తను పంచుకునేవారిగా చేయాలి. ఇట్టి దైవిక ప్రేమ మన జీవిత మ్యాన్యువల్‌గా ఉండాలి. అలనాటి ఆది సంఘంలో వేదాంత శుద్ధి, పద్ధతులను పాటించడమే గొప్పయాగంగా, దీక్షగా, సేవగా భావించే వారిని పిలిచి కాస్తంత ప్రేమను చూపించడం నేర్చుకోండి అని పౌలు మనవి చేసుకున్నాడు, రాతపూర్వకంగా రాసి ఇచ్చాడు. ప్రేమే సర్వోత్తమమైన క్రైస్తవ మార్గం, జీవితంలో అందుకోవాల్సిన శ్రేష్ఠమైనది కూడా అదే (1 కొరింథీ 13 అధ్యాయం, మత్తయి 22:37,39; గలతీ 5:6,14).

### 3. ఆధ్యాత్మిక అందాన్ని పెంపొందించుకొందాం

వెలుపల సమాజంలో, అందరిలో మంచి

వానిగా గుర్తించబడడానికి మాట తీరు విషయంలో జాగ్రత్తగా ఉంటారు. అంతరంగంలో మాత్రం క్రూరత కలిగి వికార చేష్టలు చేస్తారు. కాలేజీ ప్రొఫెసర్స్‌ని మంచిగా పలకరించి మంచి స్టూడెంట్ అని మార్కులు కొట్టేస్తారు. ఇంట్లోనేమో అమ్మానాన్నల పై విరుచుకుపడతారు. చర్చ్‌లో చాలా సౌమ్యుడు దగ్గరి వారిపై విరుపులు, కరుపులు, అరుపులు. పొరుగు వాని పిల్లలను మెచ్చుకొంటూనే ఇంట్లో పిల్లలను వేపుకు తింటారు. మన లోపలి బతుకు ఈ సంవత్సరం మారాలని గుర్తుంచుకొందాం. అంతరంగ శుద్ధి ఆధ్యాత్మిక అందాన్ని పెంచుతుంది (మత్తయి 23:25,26).

### 4. సేవకుని పాత్రను పోషించుకుందాం

క్రైస్తవ సంఘంలో, సంస్థల్లో, సమాజంలో, ఆటల్లో పాటల్లో నెంబర్ వన్ స్థానం నాకే ఇవ్వాలి అనేదానికి ఈ సంవత్సరం స్వస్థిచెప్పి, యేసయ్య రూపం, జీవన విధానమైన దాసుని రూపం ధరించి అందరికీ మనల్ని మనమే దాసుల్ని చేసుకుందాం. మనమే ఈ దేశానికి, దేశ ప్రజలకు దాసులం, ప్రభువు దాసులం. ఈ మాట కాస్త మనసుకెక్కించుకొని ముందడుగువేద్దాం (మార్కు 9:35).

### 5. జీవిత సార్థకతను వెదుకుదాం

జీవితానికి సార్థకత ఇచ్చేది దేవుడే. ఆయనకు మొదటి స్థానం ఇచ్చినప్పుడే దానిని పొందగలం. ఒకని కలిమి లేక భౌతిక సుఖాలు విస్తరించుట వాని జీవానికి మూలం కాదు. ఖరీదైన వస్తువులు, వాహనాలపైనే మన ఆశ, ధ్యాస ఉంటే చింత మన గుండెల్లో పొంగి పొర్లి పారుతూ ఉంటుందని గమనిద్దాం (మత్తయి6:23).

### 6. ధృక్పథాలను మార్చుకుందాం

సంవత్సరమంతా ఎదుటివాని తప్పులు ఎంచడంలోనే సరిపోతే నిన్ను నీవు, నన్ను నేను చూచుకునేదెప్పుడు? సరిచేసుకొనేదెప్పుడు? నేను నిర్దోషిని వాళ్ళే దోషులు అనే ధృక్పథాన్ని మార్చుకొందాం. మారిన మనుష్యులే సమాజాన్ని మారుస్తారు అన్నది నిజం చేద్దాం. మొదట మన తప్పులను మనం సరిజేసుకుందాం (మత్తయి 7:5).




### ఎందుకు పై ఆరు తీర్మానాలు తీసుకోవాలంటే..

1. మనమెవ్వరం సంపూర్ణులం కాదు. మార్పు అనేది ప్రతి ఒక్కరికీ అవసరం. దేవుడు కోరేది కూడా అదే. మన తప్పులను మనం ఒప్పుకుంటే దేవుడు దైవశక్తిని ప్రసాదిస్తాడు. దేవుని గొప్పకార్యాలు చూడడానికి వీలవుతుంది.
2. దిద్దుబాటు చేసుకోవడానికి నిర్ణయాలు చేయడం అవసరం. దేవుని న్యాయపీఠము ఎదుట దోషులముగా తీర్పుపొందటంకంటే ఇక్కడే, ఇప్పుడే జీవితాన్ని సరిదిద్దుకుంటే పరలోకంలో బహుమానం పొందగలం.
3. దేవున్ని పూర్తిగా నమ్ముటకు నూతన సంవత్సర తీర్మానాలు సహాయ పడతాయి. విశ్వాస జీవిత ప్రయాణాన్ని సజావుగా కొనసాగించగలం.
4. జీవిత సాఫల్యత. దేవుని ఉన్నతమైన పిలుపుకు తగినట్టుగా నడుచుకొని పనిచేయుట ద్వారా జీవిత సాఫల్యత, సంతృప్తి పొందగలం.
5. మన దేవుడు భవిష్యత్తు లేక ముందు కాలంలో ఉన్నదేవుడు గనుక ముందున్న వాటికై పరుగెడుతూ జీవితంలో గురికలిగి పౌలు వలె పరిగెత్తాలి.

సంకోచించక, భయపడక, పైన పేర్కొన్న ఆరు నిర్ణయాలను ఈ నూతన సంవత్సర తీర్మానాలుగా తీసుకుందాం. దేవునితో నిబంధన చేసుకుందాం. రానున్న 365 రోజులు ఆ దిశగా అడుగులు వేద్దాం.

ఇదివరకెన్నడూ దున్నని బీడుభూమిని దున్నే ముందు (సేవ ప్రారంభించక ముందు) మొదట బీడుగా మారిన పనికిరాని మన జీవితాలను దున్నుకుందాం. దేవునికి ఇష్టమైన, ఫలించే జీవితాలుగా పరిశుద్ధాత్మ దేవుడు తీర్చిదిద్దునట్లు ఆలస్యం చేయక ముందుకు అడుగులు వేద్దాం. ఈ నూతన సంవత్సరంలో ఆశీర్వాదాలన్నీ అందుకుందాం.

**– ఆర్. ప్రభుదాస్,** తెనాలి



ప్రత్యేకం

# క్రీస్తు కేంద్రిత జీవితం

విశ్వాసులు "క్రీస్తు కేంద్రిత జీవితం" అనే మాటల్ని తరచుగా వాడతారు. అయితే ఈ విషయం గురించి మాట్లాడడం సులువే కానీ జీవించడం చాలా కష్టం. ఏమంటారు? వ్యక్తుల అనుదిన జీవితంలో కేంద్ర స్థానం కోసం క్రీస్తుతో పాటు అనేక విషయాలు పోటీకి వస్తాయి. కాబట్టి క్రీస్తు కేంద్రిత జీవితం గురించి మరింతగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే నాలుగు విషయాలను పరిశీలిద్దాం.

### 1. మూలం

మన ఉనికికి, మనకు కలిగిన సమస్తానికి మూలం లేదా ఆధారం ప్రభువే అనే విషయం గ్రహించినప్పుడు మాత్రమే మనం క్రీస్తు కేంద్రిత జీవితం జీవించడం ఆరంభమవుతుంది. ఆయన మనలను సృజించాడు, మనం ఆయనకు చెందినవారం. ఆయన మనకు అనేక తలాంతులను, అధికృతలను ఇచ్చాడు. మన జీవితాన్ని రూపుదిద్దింది ఆయనే. రోజూ మనం అనుభవిస్తున్న ప్రతి ఆశీర్వాదం ఆయన నుంచే వచ్చింది (ఆది 1, అపో.కా. 17:26; యాకోబు 1:17). అంతేకాకుండా, మనం ప్రతిరోజూ చేసే మంచి పనులకు, మన నీతికి కూడా ఆధారం క్రీస్తే. వాక్యానుసారమైన మంచి జీవితం జీవించాలనే సహజమైన కోరిక, నైతిక సామర్థ్యం మనలో లేదు. అయితే దేవునికి ఇష్టమైన జీవితం జీవించడానికి అవసరమైనదంతా క్రీస్తులో మనం కలిగి ఉన్నాం (2 పేతురు 1:3).

### 2. ప్రేరణ

మన ఆలోచనలకు, మాటలకు, ప్రవర్తనకు, చేసే ప్రతి పనికి ప్రేరణగా క్రీస్తు ఉన్నప్పుడు మాత్రమే అది క్రీస్తు కేంద్రిత జీవితం అవుతుంది. అయితే మనలో చాలామంది అనుదిన జీవితంలో క్రీస్తుకు అంతగా ప్రాధాన్యత లేని కొద్ది స్థానం మాత్రమే ఇస్తారు. చాలామంది క్రైస్తవులు భక్తి జీవితంలో స్వనీతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సంఘ నియమాలకు ఇచ్చినంత ప్రాధాన్యత క్రీస్తుకు ఇవ్వరు. నీవు క్రీస్తుతో వ్యక్తిగత, సన్నిహిత సంబంధం కలిగి ఉన్నావా? నీవు క్రీస్తును మరింతగా తెలుసుకోవాలని ఆశపడుతున్నావా? ఆయనతో కలిసి నడవాలని, ఆయనతో కలసి పని చేయాలని ఇష్టపడుతున్నావా? ఆయనను సంతోషపెట్టాలనే కోరిక నీకు ఉందా? ఆయన వ్యక్తిత్వం, గుణలక్షణాలు కలిగి జీవించాలని నీవు కోరుకుంటున్నావా? అనుదిన జీవితంలో క్రీస్తు ద్వారా ప్రేరణ పొంది ఆయనతో అత్యంత సన్నిహితంగా ఉండేదే క్రీస్తు కేంద్రిత జీవితం.

### 3. లక్ష్యం

మన అనుదిన జీవితం ద్వారా యేసు మహిమ పొందాలనే ఏకైక గురి, లక్ష్యం కలిగి ఉండడమే క్రీస్తు కేంద్రిత జీవితం. మనం వ్యక్తిగతంగా సొంత ఇష్టాలు, లక్ష్యాలు కలిగి ఉండడం తప్పు కాదు. అయితే వాటన్నింటిని నడిపించే దిక్సూచిగా యేసు మహిమ పొందడం, ఆయనకు ఘనత రావడం ఉండాలి. అలావుంటే మన జీవితం ద్వారా క్రీస్తుకు ఘనత రావాలని, ఆయన ఆరాధించబడాలని కోరుకొంటాం. ఆయనకు విధేయత చూపించాలని,

ఆయనను లోకంలోనివారికి ప్రకటించాలని, పరిచయం చేయాలని ఆశపడతాం. అందుకే మన లక్ష్యాలన్నీ ఆయనకు సమర్పించుకొంటాం. మనం నిజంగా క్రీస్తు కేంద్రిత జీవితం జీవించాలని ఆశిస్తే మన నిర్ణయాలు స్వార్థ పూరితంగా ఉండవు. ఆయన ప్రేమ ద్వారా పొందిన కొత్త ఆశలు, ఆకాంక్షలు ఆధారంగా నిర్ణయాలు తీసుకొంటాం (2 కొరింథీ 5:14-15).

## 4. నిరీక్షణ


క్రీస్తు కేంద్రిత జీవితంలో మనకు కలిగినదంతా ఆయన చేతిలో పెడతాం. మన జీవితం ఈ లోకంతోనే ముగిసిపోదని, ఈ లోకం తరువాత కూడా భవిష్యత్ ఉందని, నిత్యత్వంలో జీవిస్తామని మనకు తెలుసు. క్రీస్తు కేంద్రిత జీవితం అంటే కేవలం నరకం తప్పించుకోవడం మాత్రమే కాదు. క్రీస్తులో మన ప్రస్తుత, భవిష్యత్ జీవితానికి ఓ నిరీక్షణ ఉంది. ఆయన తన సన్నిధి, కృప నిరంతరం మనతో ఉంటాయని వాగ్దానం చేశాడు. ఇలాంటి గ్రహింపుతో, నిరీక్షణతో జీవిస్తాం.

**వ్యక్తిగత పరిశీలన:** నేను క్రీస్తు కేంద్రిత జీవితం జీవిస్తున్నానా? నా జీవితానికి క్రీస్తే ఆధారంగా ఉన్నాడా? నేను చేసే ప్రతి పనికి ప్రేరణ ఆయనేనా? నా ప్రస్తుత జీవితానికి, నిత్యత్వానికి ఆయన యందు నిరీక్షణ కలిగి ఉన్నానా?

ముందే చెప్పినట్టు మన హృదయంలో కేంద్ర స్థానం ఆక్రమించడానికి అనేక విషయాలు పోటీపడుతున్నాయి. యేసుక్రీస్తుకు మన హృదయంలో కేంద్ర స్థానం లేనప్పుడే ఆయన మనలను అంగీకరించి మన సమస్త పాపాలను క్షమించాడు.

*"మన జీవితంలో మనం రక్షకునికి కేంద్ర స్థానం ఇచ్చే కొలది ఆయన మనతో ఓపిగ్గా నడుస్తాడు మరియు మన పోరాటాలలో తోడుగా ఉంటాడు".*
*- పాల్ ట్రిప్*

## స్వయం కేంద్రితమా, దేవుని కేంద్రితమా?



నీ జీవితంలో అత్యంత ప్రాముఖ్యమైనది ఏంటి? నీవు దేనికోసం లేక ఎవరికోసం జీవిస్తున్నావు? జీవితంలో ఎంపిక చేసుకోవడానికి ఎన్నో ఉన్నాయి. నీవు నీ వృత్తిని, ఏదైనా ఆటను, ఓ అలవాటును, ధనం సంపాదించడాన్నీ లేదా ఆనందించడమే జీవితంలో ప్రాముఖ్యమైనదిగా భావించవచ్చు.

నిజానికి వీటిలో ఏది కూడా తప్పు కాదు, అవన్నీ మంచివే. అయితే వీటిలో ఏ ఒక్కటి జీవితానికి కేంద్రస్థానంగా ఉన్నా, అంటే అదే జీవితంగా ఉంటే, ఆ జీవితం నాసిరకంగా ఉంటుంది. నీవు పోగొట్టుకోలేనిది, ఎన్నడూ మారనిది నీ జీవితానికి కేంద్రంగా ఉండడం అవసరం. నీకు ఎల్లప్పుడూ క్షేమాన్ని కలిగించేది నీ జీవితానికి కేంద్రస్థానంగా ఉండాలి.

క్రీస్తు కేంద్రిత జీవితం నీవు కలిగి ఉంటే, ఇక నీవు చింతించాల్సిన అవసరం లేదు. ఇంకా నీవు చింతిస్తున్నావు అంటే దేవుని కాకుండా మరెవరినో లేదా మరి దేనినో నీ జీవిత కేంద్ర స్థానంలో ఉంచడానికి నీవు అనుమతించావని అర్థం. ఎవరైనా ఒక వ్యక్తికి నీ జీవితంలో కేంద్రస్థానం ఇస్తే నీవు చింతించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ వ్యక్తి నీ జీవితంలో నుండి ఎప్పుడైనా వెళ్ళిపోవచ్చు, చనిపోవచ్చు లేదా అనారోగ్యం పాలు కావచ్చు కాబట్టి చింతిస్తావు.

"దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనలచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" (ఫిలి 4:6). మనలో కేంద్ర స్థానాన్ని ఆక్రమించిన చింతను తొలగించి, ఆ స్థానంలో క్రీస్తు ఉంటే ఆ జీవితం ఎంత అద్భుతంగా ఉంటుంది?

అయితే నీ జీవిత కేంద్ర స్థానంలో ఉంచదగిన ఏకైక వ్యక్తి ప్రభువైన యేసుక్రీస్తు. ఆయన ఎన్నడూ మార్పు చెందనివాడు మరియు మన జీవితాంతం ఆయన మనలను నడిపించగల సమర్థుడు.

గత కాలంలో ఉన్న సూపర్ బాల్స్ గురించి మీకు తెలుసు కదా! ఆ బంతులను నేల వైపు విసిరితే అవి వెంటనే 30 నుండి 40 అడుగుల ఎత్తు వరకు ఎగురుతాయి. ఎందుకంటే ఆ బంతి కేంద్రంలో

**మత కేంద్రిత జీవితం కలిగినవారు ఆధిక్యత కోసం, అగ్ర పీఠాల కోసం, గుర్తింపు కోసం, తమ సామర్థ్యాలు, నైపుణ్యాల ద్వారా వచ్చే మహిమ కోసం ప్రాకులాడతారు. వారు తాము సొంతంగా ఏర్పరచుకున్న నియమాలను ప్రామాణికాలుగా మారుస్తారు. తమసొంత ప్రామాణికాల ఆధారంగా ఇతరులకు తీర్పు తీరుస్తూ, తమ్మును తాము హెచ్చించుకొంటూ ఉంటారు.**

గట్టిగా కుదించిన ఘన పదార్థం ఉంది. అదే దానికి అంతటి ఎగిరే సామర్థ్యం ఇస్తుంది.

*"అలాగే నీ హృదయ కేంద్రంలో క్రీస్తు ఉంటే పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం నీకు వస్తుంది. అప్పుడు నీవు ఒత్తిడి, సమస్యలు, దు:ఖం, సంక్షోభాల నుంచి త్వరగా బయట పడగలవు. ఎన్నడూ మారని బలమైన దేవుడు నీ జీవితంలో ఉన్నాడు కాబట్టి నీవు చింతపడాల్సిన అవసరం లేదు". – రిక్ వారెన్*

## క్రీస్తు కేంద్రిత జీవితం ఎలా ఉంటుంది?

### సమర్పణ ఉంటుంది

యేసుక్రీస్తును ప్రభువుగా అంగీకరించి ఆయన కోసం సమర్పణతో జీవించేదే క్రీస్తు కేంద్రిత జీవితం. ప్రతి ఒక్కరి నిర్ణయాల వెనుక ఏదో ఒక బలమైన ప్రేరణ ఉంటుంది. కొందరు సౌఖ్యం లేదా ధనం కోసం ప్రేరేపించబడి దానికోసమే జీవిస్తారు. మరి కొందరు కుటుంబం, ఉద్యోగం లేదా ఏదైనా ఒక లక్ష్యం కోసం ప్రేరేపించబడి దానికోసమే జీవిస్తారు. నిజానికి ఇవన్నీ జీవితంలో కలిగి ఉండడం తప్పు కాదు. అయితే ఏది మన జీవితంలో కేంద్రంగా ఉంటుందో అదే మనకు దేవుడుగా మారుతుంది.

### ఆరాధన ఉంటుంది

మానవ హృదయం స్వతహాగా, సహజంగా ఏదో ఒక దానిని ఆరాధిస్తుంది. ఒకవేళ దేవుడిని ఆరాధించకపోతే, ఆ స్థానంలో మరొక దానిని ఆరాధిస్తుంది. మనం క్రీస్తు కేంద్రిత జీవితం కలిగి ఉండకపోతే మన జీవితంలో ఏదో ఒకటి కేంద్ర స్థానంలో ఉంటుంది. మనం సమయం, ధనం, భావోద్వేగాలు, అనుబంధాలు ఎక్కువగా దేని మీద ఖర్చు చేస్తామో దానిని మనం ఆరాధిస్తున్నట్లే. మనలో ఏది బలమైన సమర్పణ పుట్టిస్తుందో అది మన దేవునిగా గుర్తించబడుతుంది. కొంత కాలం తరువాత మనం దానిని పోలి ఉంటాము.

మనం దాని గురించే మాట్లాడతాం, ఆలోచిస్తాం, కలలు కంటాం, దానితో ఎక్కువ సమయం గడపడానికి ప్రణాళికలు వేసుకొంటాం. మనలను బాగా సన్నిహితంగా ఎరిగిన వారికి మన అంతరంగంలోని కోరిక, అంటే మనం ఆరాధించేది ఏమిటో సులువుగా తెలిసిపోతుంది. మనం దేనిని ఆరాధిస్తున్నామో దానిని రహస్యంగా ఉంచడం సాధ్యం కాదు.

క్రీస్తును తమ జీవితంలో కేంద్ర స్థానంలో ఉంచి, ఆయన్ను వెంబడించే వారు కొంతకాలానికి ఆయనవలే మారతారు. ఎవరు ఆయన గురించి ఎక్కువగా మాట్లాడతారో, ఆలోచిస్తారో, కలలు కంటారో, ఎక్కువ సమయం ఆయన సన్నిధిలో గడుపుతారో వారు క్రీస్తు కేంద్రిత జీవితం కలిగినవారు. ఆయన్ను సంతోష పరచాలని, వారు ఆయన సారూప్యంలోకి మారాలనే బలమైన ఆకాంక్ష కలిగి ఉంటారు. దేవున్ని మహిమపరచడమే క్రీస్తు కేంద్రిత జీవితం యొక్క ప్రధాన ఉద్దేశం.

### మత కేంద్రిత జీవితం ఉండదు

ఇక్కడ క్రీస్తు కేంద్రిత జీవితాన్ని మత కేంద్రిత జీవితంగా పొరపాటు పడకూడదు. యేసుక్రీస్తు కాలంలోని పరిసయ్యులు మతం కేంద్రంగా జీవించారు. వారు ధర్మశాస్త్రాన్ని తిన్నారు, తాగారు, అందులోనే నిద్రపోయారు. అంటే ధర్మశాస్త్రమే జీవితంగా జీవించారు. అయితే యేసుక్రీస్తు వారిని చాలా తీవ్రంగా గద్దించాడు. వారు ధర్మశాస్త్రం కేంద్రంగా జీవించారు కానీ ఆ ధర్మశాస్త్రాన్ని ఇచ్చిన దేవుని ప్రేమ వారిలో లేదు. ఇదే మత కేంద్రిత జీవితానికీ, దేవుని కేంద్రిత జీవితానికీ అసలైన తేడా (మత్తయి 23:25; లూకా 11:42).

మత కేంద్రిత జీవితం కలిగినవారు ఆధిక్యత కోసం, అగ్ర పీఠాల కోసం, గుర్తింపు కోసం, తమ సామర్థ్యాలు, నైపుణ్యాల ద్వారా వచ్చే మహిమ కోసం ప్రాకులాడతారు. వారు తాము సొంతంగా ఏర్పరచుకున్న నియమాలను ప్రామాణికాలుగా మారుస్తారు. తమసొంత ప్రామాణికాల ఆధారంగా

ఇతరులకు తీర్పు తీరుస్తూ, తమ్మును తాము హెచ్చించుకొంటూ ఉంటారు. క్రీస్తు కేంద్రిత జీవితం కలిగినవారు యేసుక్రీస్తు తమ కోసం చేసిన ఆయన కార్యాల మీద ఆధారపడతారు. దేవునికి దగ్గరయ్యేందుకు పరిశుద్ధ జీవితం కలిగి ఉండాలని కోరుకుంటారు (హెబ్రీ 12:14).

### భయభక్తులు ఉంటాయి

క్రీస్తు కేంద్రిత జీవితంలోని రహస్యం దేవుని యెడల భయభక్తులు కలిగి ఉండడమే (కీర్తన 19:9; సామె 16:6). అంటే మనం మాట్లాడే, ఆలోచించే, చేసే ప్రతిపనిని పరలోకపు తండ్రి గమనిస్తున్నాడు అనే గ్రహింపు కలిగి ప్రతి విషయంలో జాగ్రత్తగా ఉండాలనే స్పృహ కలిగి జీవించడం (మత్తయి 28:20). క్రీస్తు కేంద్రిత జీవితం కలవారు దేవుని సన్నిధిని ప్రత్యక్షంగా అనుభవిస్తూ వాస్తవిక జీవన విధానాన్ని పెంపొందించుకొంటారు. వారు "ఇది దేవునికి ఇష్టం కలిగిస్తుందా" అని ఆలోచించి నిర్ణయాలు తీసుకొంటారు. తద్వారా వారు సాతాను వలలను, లోకపు చిక్కులను తప్పించుకోగలుగుతారు. ఒకవేళ యేసుక్రీస్తు ఈరోజు నాతో గడిపితే నేను ఏమి చేస్తాను? ఏమి చూస్తాను? ఎలా మాట్లాడతాను? అనే ఆలోచన విధానం కలిగి జీవిస్తారు. (1 తిమోతి 3:7; ఎఫెసీ 6:11).

### పశ్చాత్తాపం ఉంటుంది

యేసు క్రీస్తు తప్ప మరెవ్వరూ సంపూర్ణమైన మంచి జీవితం జీవించలేదు (హెబ్రీ 4:15). నిజానికి క్రీస్తు కేంద్రిత జీవితం జీవించాలనే బలమైన కోరిక కలిగినవారు కూడా కొన్ని బలహీన క్షణాల్లో తొట్రుపడ్డారు, పడిపోయారు, పాపం చేశారు, శరీరానుసారమైన నిర్ణయాలు తీసుకున్నారు (1 యోహాను 1:8-10). అయితే వారు అట్టి వాటిలో కొనసాగకుండా వెంటనే పశ్చాత్తాపపడ్డారు, తిరిగి త్వరగా దేవుని సహవాసంలోకి వచ్చారు. ఇలా నిరంతరం దేవునితో సమన్వయం చేసుకుంటూ జీవించే జీవితమే క్రీస్తు కేంద్రిత జీవితం. అయితే అది జీవిత కాలం జరిగే ప్రక్రియ. ఈ ప్రక్రియలో దేవుడు వారిని యేసు స్వరూపంలోకి మారుస్తాడు (రోమా 8:29; హెబ్రీ 12:14). మనం మొదట మన హృదయంలో ఆయనకు ప్రథమ స్థానం ఇస్తే, ఆ తరువాత మన జీవితాలు ఆయనను వెంబడిస్తూ ఉంటాయి.



### క్రీస్తు కోసం కేటాయించుకో

ప్రతి క్రైస్తవునికి ఒక ప్రాముఖ్యమైన మాట చెప్పాలని ఆశపడుతున్నాను. ఈ విషయాలు చెప్తూ క్రీస్తు కోసం మిమ్మల్ని సవాలు చేస్తున్నాను. జాగ్రత్త పడాల్సిన విషయమేమంటే లోకం లేదా లోక సంబంధమైన పాపం మీ హృదయంలోకి దొంగచాటుగా చొరబడుతుంది. ఏ మాత్రం ఉపయోగం లేని చిన్నచిన్న విషయాలతో నీ హృదయాన్ని నింపుతుంది. ఇలా అనవసరమైన విషయాలతో నీ హృదయాన్ని నింపి క్రీస్తుకు నీ హృదయంలో స్థానం లేకుండా చేస్తుంది. అప్పుడు అనవసర విషయాలకు నీ హృదయంలో ప్రాధాన్యం పెరుగుతుంది. నీ సమయమంతా లోక సంబంధమైన విషయాలకే ఖర్చు చేస్తావు. వస్తువులకు ప్రాధాన్యత పెరుగుతుంది. ప్రభువైన యేసుక్రీస్తుతో సహవాసానికి సమయం లేకుండా చేస్తుంది. దేవుని వాక్యం చదవడానికి కూడా సమయం ఉండదు. అలా నీ అంతట నీవే నీ హృదయంలో క్రీస్తుకు పెద్దగా స్థానం లేకుండా చేసుకొంటావు.

అలాగే గుర్తుంచుకోవాల్సిన విషయమేమంటే లోకం నిన్ను ఎప్పటికీ తృప్తి పరచలేదు. కానీ మనకు అత్యంత ప్రియమైన ప్రభువు మనలను అద్భుతంగా తృప్తి పరుస్తాడు. కాబట్టి మనం ఆయనను ఘనపరచాలి. నిన్ను ఇప్పటి వరకు ఏదీ తృప్తిపరచలేకపోయి ఉంటే, నీ హృదయంలో ఇంకా శూన్యత ఉంటే, యేసు నిన్ను తృప్తి పరుస్తాడు అనే విషయం గుర్తుంచుకో. ఆయన లక్షలాది ప్రజల హృదయ వాంఛ తీర్చి వారిని తృప్తి పరిచాడు. వారు అనేక మందికి సాక్ష్యం కూడా చెప్పారు.

*"లోక సంబంధమైన విషయాలు, శరీర కార్యాలు తప్ప ఏమీ తెలియని వారు, తృప్తి లేని జీవితం గడుపుతారు. వారి హృదయంలోకి యేసు వచ్చినప్పుడు చీకటితో నిండివున్న వారి ఆత్మలకు అరుణోదయం అనుగ్రహిస్తాడు. తద్వారా వారి జీవితాలను అద్భుతమైన వెలుగుతో నింపుతాడు".*
*– వర్జీనియా బ్రాండ్*

**Source:** https://anchor.tfionline.com/post/what-christ-centered-life/

# మంచి ముగింపు

*బైబిల్‌లో సుమారుగా 800 మంది నాయకులు ఉన్నారు. మనం అధ్యయనం చేయడానికి వారిలో 100 మంది వ్యక్తుల సమాచారం మాత్రమే మనకు అందుబాటులో ఉంది. వీరు తమ జీవితాన్ని ఎలా ముగించారు అనే విషయాన్ని సమీక్షించడానికి సరిపోయేంత సమాచారం వారిలో 50 మందికే ఉంది. వీరిలో ప్రతి ముగ్గురిలో ఒకరు మంచిగా ముగించారు. ప్రస్తుత కాల నాయకుల నుంచి యాదృచ్ఛికంగా సేకరించిన సమాచారంతో పోలిస్తే, బైబిల్లో మంచిగా ముగించిన నాయకుల శాతం గొప్పగా ఉన్నట్లే భావించాలి. ఈనాటి నాయకులలో ముగ్గురిలో కనీసం ఒకరు కూడా మంచిగా ముగించలేక పోతున్నారు.*

ఈ వ్యాసం రాసే సమయంలో సుమారు 1300 మంది నాయకుల జీవితాలను నేను అధ్యయనం చేశాను. వీరిలో 50 మంది బైబిల్‌లోని నాయకులు, 100 మంది చరిత్రలోని నాయకులు. మిగిలినవారు సమకాలీన నాయకులు.

నాయకత్వ అంశాలను దృష్టిలో ఉంచుకొని బైబిల్‌ను పదేపదే చదివినప్పుడు, నాలుగు కీలకమైన విషయాలు వెలుగులోకి వస్తాయి.

1. అతికొద్దిమంది నాయకులు మాత్రమే మంచిగా ముగించారు.
2. నాయకత్వం కష్టమైన పని.
3. నాయకత్వం విజయవంతం అవ్వాలంటే అందులో తప్పనిసరిగా ఉండాల్సిన అంశం దేవుని శక్తివంతమైన సన్నిధి.
4. ఆత్మీయ నాయకత్వం గొప్ప ప్రభావాన్ని చూపిస్తుంది.

బైబిల్‌లోని నాయకుల విషయంలో ఉన్న సత్యాలు సమకాలీన నాయకుల విషయంలో కూడా సత్యమే. పైన తెలిపిన నాలుగు విషయాలలో మొదటి దానిగూర్చి ఈ ఆర్టికల్లో వివరించబోతున్నాను. అతికొద్దిమంది నాయకులు మాత్రమే మంచిగా ముగిస్తారు అనే సత్యం నాకు గట్టి హెచ్చరికను ఇచ్చింది. ఇది మరికొంత అధ్యయనానికి దారి తీసింది. కొద్దిమంది నాయకులు మాత్రమే మంచిగా ముగించడానికిగల కారణం ఏంటి? వారిని ఆటంకపరిచే విషయాలు ఏంటి? వారికి సహాయపడే విషయాలు ఏంటి? మంచిగా ముగించడం అంటే అర్థం ఏంటి?



అనే అంశాలతోపాటు మంచిగా ముగించే వారికి ఉండే ఆరు లక్షణాలను మొదటిగా ఈ ఆర్టికల్‌లో నేను వివరిస్తున్నాను.

**ఆరు లక్షణాలు**

మంచిగా ముగించిన శక్తివంతమైన నాయకుల జీవితాలను సరిపోల్చుకొంటూ చేసిన అధ్యయనంలో ఆరు లక్షణాలను నేను గుర్తించాను. నేను గమనించని ఇతర లక్షణాలు కూడా ఉండి ఉండవచ్చు. అయితే, నేను చెప్పబోతున్న ఈ ఆరు లక్షణాలు మాత్రం ప్రాముఖ్యమైనవి. ఈ ఆరు లక్షణాలు అన్నిసార్లు అందరిలో కనిపించకపోవచ్చు. అయితే, కొన్నిమాత్రం మంచిగా ముగించిన నాయకులలో కనిపిస్తాయి. మంచిగా ముగించిన శక్తివంతమైన నాయకుల జీవితాలలో ఐదు లేదా నాలుగు లక్షణాలు కనిపిస్తాయి. పాత నిబంధనలోని దానియేలు, క్రొత్త నిబంధనలోని పౌలు వంటి వారిలో ఈ ఆరు లక్షణాలు కనిపిస్తాయి. మంచిగా ముగించే వారిలో ఉండే ఈ ఆరు లక్షణాలు ఏంటో చూద్దాం.

**1. దేవునితో అన్యోన్య సంబంధాన్ని వారు చివరి వరకు కలిగి ఉంటారు.**

పాత నిబంధనలో దీనికి గొప్ప ఉదాహరణ దానియేలు. కొత్త నిబంధనలో పేతురు, పౌలు, యోహానులు ఈ లక్షణాన్ని కలిగియున్నారు. వారి చివరి రచనలను చూడండి. వారి స్వరం, దేవునితో వారికి ఉన్న సాన్నిహిత్యం, దేవుని నుంచి వారు పొందిన ప్రత్యక్షత, తమ జీవితాలలో తమను బలపరిచే దేవుని కృప పట్ల వారి విశ్వాసం వారి చివరి రచనల్లో కనిపిస్తాయి.



**2. వారు నేర్చుకొంటూనే ఉంటారు. మంచిగా ముగించడానికి సహాయపడే కారకాలలో ఈ లక్షణం ఒకటి.**

పాత నిబంధనలో దీనికి గొప్ప ఉదాహరణ దానియేలు. దానియేలు తొమ్మిదవ అధ్యాయం గమనిస్తే వృద్ధాప్యంలో కూడా లేఖనాలను అధ్యయనం చేసి, అనేక విషయాలను నేర్చుకోవడంలో దానియేలు గొప్ప ఉదాహరణగా ఉన్నాడు. నేర్చుకోవడం అనే విషయంలో కొత్తనిబంధనలో గొప్ప ఉదాహరణలు పేతురు, పౌలు (2 పేతురు 3:18; 2 తిమోతి 4:13).

**3. తమ జీవితంలో ఆత్మఫలాన్ని ఫలిస్తూ, క్రీస్తును పోలిన జీవితాన్ని కలిగి ఉంటారు.**

గొప్ప దైవభక్తి కలిగిన జీవితానికి పాత నిబంధనలో గొప్ప ఉదాహరణ దానియేలు. ఆయన జీవితానికి సంబంధించిన సారాంశాన్ని చూడండి. (యెహెజ్కేలు 14:14,20). పౌలు జీవితంలో వచ్చిన గొప్ప మార్పు కొత్త నిబంధనలో దీనికి మంచి ఉదాహరణ (2 తిమోతి 2:24; ఫిలేమోను పత్రిక). తమ నాయకత్వశైలిలో ఎంతో కఠినత్వాన్ని కలిగి ఉన్న వీరు తర్వాత కాలంలో మృదుత్వాన్ని, సాధుత్వాన్ని చూపించారు.

**4. సత్యాన్ని అనుసరించి వారు జీవిస్తారు. తద్వారా దేవునికి సంబంధించిన సత్యాలు, దేవుని వాగ్దానాలు వాస్తవమే అని నిరూపితమౌతాయి.**

యెహోషువా చివరి మాటల్ని గమనిస్తే తన జీవితంలో దేవుని వాగ్దానాలు సత్యమని అవి ఎన్నడూ తప్పిపోలేదని దేవుని నమ్మిన, దేవుని సత్యం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన లక్షణాన్ని నిరూపిస్తున్నాయి (యెహోషువ 23:14). తిమోతికి తాను రాసిన రెండు పత్రికలలో ఈ సత్యాన్ని పౌలు ఎలా మేళవించాడో చూడండి. అ.కా. 27:22-25 లోని ప్రేరణ కలిగించే ఆయన నమ్మకాలను చూడండి.

**5. ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ వారసత్వాలను వారు వదిలి వెళ్తారు.**

మంచిగా ముగించిన శక్తివంతమైన నాయకులు ఏమి వదిలివెళ్ళారు అని అధ్యయనం చేయగా, నేను ఈ కింది వాటిని కనుగొన్నాను.

## వన్నె తరగని వారసత్వాలు వాటిలోని రకాలు

| రకాలు | వివరణ |
|---|---|
| పరిశుద్ధుడు | ఇతరులు అనుకరించాలని కోరుకొనే మాదిరి జీవితం |
| సొగసైన అభ్యాసకులు | ఇతరులు అనుకరించాలని ఆశించే పరిచర్య మాదిరి. |
| మెంటార్స్ | విస్తారమైన వ్యక్తిగత పరిచర్య. దీని అంతిమ ఫలితం మారిన జీవితాలు. |
| చాతుర్యం కలిగిన బహిరంగ పరిచారకులు | విస్తారమైన బహిరంగ పరిచారకులు. దీని అంతిమ ఫలితం మారిన జీవితాలు. |
| పయనీర్స్ | దేవుని కోసం కొత్త ప్రదేశాలలో పరిచర్యను ప్రారంభిస్తారు. దీని అంతిమ ఫలితం దేవుని కోసం నూతన సంఘాలు, నూతన ఉద్యమాలు, నూతన పరిచర్యలు ప్రారంభమౌతాయి. |
| క్రూసేడర్స్ | తప్పుల్ని సవరించేవారు. దీని అంతిమ ఫలితం సంస్థలు, సమాజాలు మొ॥నవి మార్పుచెంది, నీతి, నిజాయితీ మొ॥నవి కనిపిస్తాయి. |
| కళాకారులు | సృజనాత్మకంగా పని చేయడాన్ని పరిచయం చేసేవారు. దీని అంతిమ ఫలితం – వీరు ఏది చేసినా – విభిన్నంగా ఎలా చేయాలి అనే దానికి మాదిరిగా ఉంటారు. |
| వ్యవస్థాపకులు | పయనీర్స్‌లోని ఒక ప్రత్యేక తరగతికి చెందినవారు. వీరు నూతన క్రైస్తవ సంస్థలను ప్రారంభిస్తారు. దీని అంతిమ ఫలితం – నూతన సంస్థలు. |
| స్థిరపరిచేవారు | సంఘాలలో, ఉద్యమాలలో, సంఘ సంస్థలలో వాటిని ఇంకా అభివృద్ధి చేసేందుకు, వాటిని ఉజ్జీవంగా, స్థిరంగా ఉంచేందుకు పాటుపడేవారు. దీని అంతిమ ఫలితం, సంస్థలు, సంఘాలు ఉజ్జీవింపబడి శక్తివంతంగా ఉంటాయి. |
| పరిశోధకులు | క్రైస్తవ జీవితంలో, పరిచర్యలో ఆయా విషయాలు జరగడానికి కారణం ఏంటి అని పరిశోధించి తెలుసుకొనేవారు. దీని అంతిమ ఫలితం, క్రైస్తవ పరిచర్యలో ఇతరులకు సహాయపడగలిగే శక్తివంతమైన సూత్రాలు బయటకు వస్తాయి. |
| రచయితలు | క్రైస్తవ పరిచర్యలో ఇతరులకు సహాయపడేందుకు అవసరమైన ఆలోచనలను తమ రచనలలో పొందుపరిచేవారు. దీని అంతిమ ఫలితం, పుస్తకాలు. |
| వృద్ధి చేసేవారు | తమ ఆలోచనలను, భావాలను ఉపయోగించమని, పరిచర్య ఉద్యమాలలో చేరమని ఇతరులను ప్రోత్సహించేవారు, ప్రేరేపించేవారు. దీని అంతిమ ఫలితం, నూతన సాహసాలు చేయుటకు ప్రజలు కంకణం కట్టుకొంటారు. |

దానియేలు వదిలి వెళ్ళిన అంతిమ వారసత్వం: పరిశుద్ధుడు (మెంటార్), రచయిత, స్థిరపరచిన వ్యక్తి, పౌలు అంతిమ వారసత్వంలోని విషయాలు: పరిశుద్ధుడు, మెంటార్, పయనీర్, క్రూసేడర్, రచయిత, వృద్ధి చేసిన వ్యక్తి.

ఈ ప్రాముఖ్యమైన లక్షణాలతో పాటు, నాయకులు వదిలివెళ్ళే మరికొన్ని విశిష్టమైన వారసత్వాలు కూడా ఉండే అవకాశం ఉన్నది. వాటిని వ్యక్తిగతంగా వివరించాల్సి ఉంటుంది.

**6. లక్ష్యాలను సాధించాలనే స్పృహతో వారు జీవిస్తారు. వారి లక్ష్యాలలో కొన్నింటిని లేదా అన్నింటిని నెరవేర్చగలుగుతారు.**

ప్రత్యేకమైన ఉద్దేశాల కోసం ఒక ప్రత్యేకమైన విధానంలో దేవుడు తన హస్తాన్ని ఒక నాయకునిపై ఉంచాడు అనే బలమైన స్పృహకు కారణమయ్యే ఒక అనుభవం లేదా కొన్ని వరుస అనుభవాలలో నుంచి ఉద్భవించే ఒక బలమైన ఒప్పుదల లేదా ప్రేరణ లక్ష్యసాధక స్పృహ అని నిర్వచించవచ్చు.


ఒక గమ్యం కోసం ఒక నాయకుణ్ణి అతని జీవితకాలంలో దేవుడు సిద్ధపరుస్తాడు. ఆ గమ్యం వైపుకు వెళ్ళడానికి అవసరమైన మార్గదర్శకత్వంను దేవుడు అతనికి ఇస్తాడు. కాబట్టి, ఆ నాయకుడు తన గమ్యాన్ని ఘనంగా చేరుకొని ఘనంగా ముగిస్తాడు. దేవుని కోసం గొప్ప కార్యాలు చేసిన బైబిల్ నాయకులలోని ఎవరిలో కూడా ఈ గమ్య సాధన లక్ష్యం, స్పృహ లోపించలేదు. సాధారణంగా ఈ స్పృహ వారిలో కాలక్రమేణా కలిగింది.

యోసేపు, అతని కలలు, పిండోత్పత్తి దశలో ఉన్న ఇశ్రాయేలు దేశాన్ని అతను రక్షించిన విధానం. మోషే ఆ దేశాన్ని రక్షించిన విధానం. అన్యులకు సువార్తను తీసుకెళ్ళాలి అనే పౌలు దర్శనం మొదలగునవి.

మంచి ముగింపుకు పాత నిబంధనలోని ఒక గొప్ప ఉదాహరణ దానియేలు. అతనిలో ఈ ఆరు లక్షణాలు ఉన్నాయి. క్రీస్తుప్రభువును మినహాయిస్తే, నూతన నిబంధనలో ఒక గొప్ప ఉదాహరణ పౌలు. మంచి ముగింపులో శ్రేణులు ఉన్నాయి. కొంతమంది మంచిగా ముగించారు. అయితే, వారిలో ఈ ఆరు లక్షణాలు ఉండకపోవచ్చు లేదా ఒకటి, అంతకన్నా ఎక్కువ ప్రాముఖ్యమైన లక్షణాలు ఉండి ఉండొచ్చు. బహుశా ఈ లక్షణాల పట్టిక సంపూర్ణమైనది కాదు. ఈ లక్షణాల విషయంలో ఇతరులు నాతో పూర్తిగా ఏకీభవించకపోవచ్చు. అలాంటి పరిస్థితిలో, వారు దీనికి ప్రత్యామ్నాయ లక్షణాల జాబితాను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, మంచిగా ముగించిన నాయకులలో ఈ లక్షణాలు ఖచ్చితంగా, స్పష్టంగా కనిపిస్తాయి.

## మంచి ముగింపు - ఆరు ఆటంకాలు

మంచిగా ముగించిన శక్తివంతమైన నాయకుల జీవితాలను పోల్చి అధ్యయనం చేయడం ద్వారా మంచిగా ముగించడంలో కొందరిని ఆటంకపరచిన ఆరు విషయాలను నేను గుర్తించాను. ఒక నాయకుని జీవితం సర్వనాశనం కావడానికి వాటిలో ఒక్కటి



చాలు. కానీ, తరచుగా జరిగే విషయం ఏంటంటే, ఒక విషయంలో వైఫల్యం చెందిన నాయకుడు మిగిలిన అన్ని విషయాలలో కూడా విఫలమౌతాడు. ఆ ఆటంకాలు ఏంటి? మంచిగా ముగించలేకపోయిన వారి నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. ఈ ఆటంకాల విషయంలో మనం అప్రమత్తంగా ఉండాలి. మనం వాటిని మన జీవితంలో నుంచి తొలగించుకోవాలి. సామెతలు 22:3లో ఈవిధంగా ఉంది: బుద్ధిమంతుడు అపాయము వచ్చుట చూచి దాగును. జ్ఞానము లేనివారు యోచింపక ఆపదలో పడుదురు. మనం ముందుచూపు కలిగి ఉండాలి. వాటిలో పడిపోకుండా జాగ్రత్తపడాలి. వాటిలో చిక్కుకొనిపోకుండా మనం ఉండాల్సిన అవసరత ఎంతైనా ఉన్నది.

### 1. ధనము – ఉపయోగం, దుర్వినియోగం

శక్తివంతమైన స్థానాలలో ఉండి, ప్రాముఖ్యమైన నిర్ణయాలు, ముఖ్యంగా ధనానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకొనే స్థానంలో ఉన్న నాయకులు, ధనాన్ని సరిగా ఉపయోగించని విధానాలను అవలంభించే పరిస్థితిలోనికి వెళ్ళి, చివరకు ధనాన్ని దుర్వినియోగం చేసే పరిస్థితులు దాపురిస్తాయి. ధనాపేక్ష అనే దుర్లక్షణం హృదయలోతుల్లో నాటుకొనిపోయి ఉంటుంది. ధనాన్ని దుర్వినియోగపరిచే పరిస్థితులకు అది దారి తీస్తుంది. కొన్ని కారణాలను బట్టి కొంతమంది నాయకులు ధనాన్ని దుర్వినియోగపరిచే పరిస్థితిలోనికి పడిపోయారు.

బైబిల్ ఉదాహరణలు: పాత నిబంధనలో గిద్యోను బంగారపు ఏఫోదు, కొత్త నిబంధనలో అననీయ, సప్పీరా

### 2. అధికారము – దాని దుర్వినియోగం

పరిచర్యకు సంబంధించిన అధికారము కలిగిన నాయకులు తమ వివిధ అధికారాలను తమ పరిచర్య అభివృద్ధి కోసం ఉపయోగించాలి. అధికారము కలిగి, దాన్ని ప్రతి రోజూ ఉపయోగించే అవకాశం ఉన్నప్పుడు, దాన్ని దుర్వినియోగం చేసే ధోరణి, పరి

స్థితి కూడా ఉండే అవకాశం ఉన్నది. అధికార శ్రేణి కలిగిన వ్యవస్థలో ఉన్నతమైన స్థానానికి ఎదిగిన నాయకులు తాము పొందిన స్థాయి మూలంగా లభించిన ఆధిక్యతలను అనుభవించే ధోరణి కలిగే అవకాశం ఉంటుంది. తరచుగా, అధికార దుర్వినియోగం ఈ ఆధిక్యతలలో ఒకటిగా ఉంటుంది. సాధారణంగా, జవాబుదారిగా ఉండడానికి, వారి జవాబుదారితనాన్ని కోరేవారు ఉండకపోవడం మూలంగా ఇలాంటి పరిస్థితులు ఏర్పడతాయి.

బైబిల్ ఉదాహరణ: యాజకుల ఆధిక్యతలను అపహరించిన ఉజ్జియా

### 3. పతనానికి దారితీసే గర్వం

గర్వం ఒక నాయకుడి పతనానికి దారి తీస్తుంది. ఒక నాయకునిగా నిగ్రహాన్ని, తగ్గింపు స్వభావాన్ని అలవర్చుకోవాల్సి ఉంటుంది. మనపట్ల మనం మంచి దృక్పథాన్ని కలిగి ఉండాలి. అదే సమయంలో, దేవుడు మనకు ఇవ్వనిదే ఏ మంచి విషయం మనలో ఉండదని, నిజానికి పరిచర్య చేయడానికి మనల్ని బలపరిచేది దేవుడే అని మనం ఖచ్చితంగా గుర్తించాలి.

బైబిల్ ఉదాహరణ: దావీదు చేసిన జనసంఖ్య సేకరణ

### 4. లైంగికపరమైన అక్రమ సంబంధాలు

లైంగికపరమైన అక్రమ సంబంధాల మూలంగా ఘోరమైన పతనాన్ని చవిచూసిన వ్యక్తులు బైబిల్‌లోను, పాశ్చాత్య సంస్కృతిలోను ఉన్నారు. లైంగిక పాపానికి సంబంధించి యోసేపు మాదిరి నాయకుల మనస్సుల్లో ఎప్పుడూ ఉండాలి.

బైబిల్ ఉదాహరణ: దావీదు బత్షెబతో పాపం చేయడం ఒక కీలకమైన సంఘటన. దాని తర్వాత అతని నాయకత్వం క్షీణించడం ప్రారంభమైంది.

### 5. కుటుంబం – క్లిష్టమైన విషయాలు

భార్యాభర్తల మధ్య, పిల్లల మధ్య, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య ఏర్పడే సమస్యలు ఓ నాయకుని పరిచర్యను నాశనం చేస్తాయి. భార్యాభర్తల సంబంధాల మధ్య, తల్లిదండ్రులు, పిల్లల మధ్య, తోబుట్టువులతో ఉండే సంబంధాలలో బైబిల్ విలువలు కలిగి ఉండాల్సిన అవసరం ఉన్నది. సేవలో ఉండే అవివాహితులకు, భార్యాభర్తలకు సామాజిక గౌరవం ఈ రోజుల్లో ఎక్కువవుతుంది.



బైబిల్ ఉదాహరణలు: దావీదు కుటుంబం – అమ్నోను, తామారు, అబ్షాలోము ప్రతీకారం.

### 6. స్తంభించిపోవడం – అభివృద్ధి ఆగిపోవడం

శక్తి సామర్థ్యాలు కలిగిన నాయకులు స్తంభించిపోయే అవకాశం ఉన్నది. వారి బలమే బలహీనత అవుతుంది. పరిశుద్ధాత్మని శక్తి, నడిపింపు లేకుండానే వారు పరిచర్య చేసుకొంటూ వెళ్తారు. నాయకులు తమ జీవితకాలంలో అనేకసార్లు ఇలా స్తంభించిపోవడం జరుగుతుంది. మంచి ముగింపుకు సహాయపడే ఐదు విషయాలలో కొన్ని (దృక్పథం, నేర్చుకొనేతత్వం, మెంటార్, క్రమశిక్షణ) ఈ స్తంభించడాన్ని సరిచేయగలవు. కొన్నిసార్లు పాపం వలన అభివృద్ధి స్తంభించిపోవడం జరుగుతుంది. గనుక ఏ కారణంచేత అభివృద్ధి నిలిచిపోయిందో నిత్యం పరీక్షించుకోవాలి.

బైబిల్ ఉదాహరణ: అబ్షాలోము తిరుగుబాటుకు ముందు దావీదు పరిపాలన

ముందుస్తు హెచ్చరిక ముందుగా ఆయుధాలను సిద్ధపరచుకొనేలా చేస్తుంది. నాయకులు మంచిగా ముగించలేకపోడానికి ఇతర కారణాలు కూడా ఉండేందుకు అవకాశం ఉన్నది. సాధారణంగా, ఏదో ఒక రూపేణా అవి పాపానికి సంబంధించిన కారణాలై ఉంటాయి. పైన చెప్పిన ఈ ఆరు ఆటంకాలు నాయకులను పతనానికి గురిచేసిన వాటిలో ప్రాముఖ్యమైనవి. మంచిగా ముగించాలని కోరుకొనే నాయకులారా, జాగ్రత్తపడండి!

**– డా. జె. రాబర్ట్ క్లింటన్**

ప్రత్యేకం



# ఆరోగ్యంగా జీవిద్దాం

## ఉపోద్ఘాతం

దేవుడు మానవుని సృజించినప్పుడు అతని వ్యక్తిత్వంలో మూడు భాగాలను ఉంచాడు. మనకు బయటకు కనపడే స్పృశించదగిన భాగం - శరీరం, కనపడని ప్రాణము, ఆత్మ. ఈ మూడు భాగాలకు వానివాని పని నియమించాడు. దేహము, ప్రా-ణము కలసి మన భౌతిక ప్రపంచంతో మనకు సంబంధాన్ని ఏర్పరుస్తాయి. ఆత్మ మనకు కనపడని ఆత్మస్వరూపుడైన దేవునితో సంబంధాన్ని కలిగి ఉండడానికి సహాయపడుతుంది. మనము ఆరోగ్యం గురించి మాట్లాడేటప్పుడు ఈ మూడు రంగాల్లోని ఆరోగ్యం అని గుర్తుంచుకోవాలి. దేహము యొక్క ఆరోగ్యం ప్రాథమికంగా మనం భుజించే ఆహారం మీద ఆధారపడి ఉంటుంది. వ్యాయామం, పరి సరాల పరిశుభ్రతలు కూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి. దేహం యొక్క ఆరోగ్యం ప్రాణంలోని ప్రాముఖ్య భాగమైన మనస్సుతో ముడిపడి ఉంటుంది. ఒకవిధంగా దేహం కంటే మనస్సు బలమైనదని చెప్పక తప్పదు. దేహము, ప్రాణము భౌతిక ప్రపంచముతో సంబంధం గలవి కాబట్టి తాత్కాలికమైనవిగా గుర్తించాలి. కానీ మానవ ఆత్మ దేవునితో మానవుని అనుసంధానం చేయడంలో తోడ్పడే ఏకైక భాగం. కాబట్టి ఇది శాశ్వతమైనదిగా గుర్తించాలి. విశ్వాసిలోనే ఆత్మ తన ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఎందుకంటే దేవునితో శాశ్వతమైన సంబంధము కలిగి నిత్యత్వంలోనికి మనలను తీసుకొని వెళ్ళగలిగిన భాగము ఇది ఒక్కటే. ఈ మూడు భాగాల ఆరోగ్యం గురించి కొన్ని ప్రాముఖ్యమైన విషయాలు తెలుసుకుందాం.

## దేహ ఆరోగ్యం

తల్లిదండ్రుల లైంగిక కణముల కలయిక వలన ఏర్పడిన సంయుక్త బీజకణము, కణవిభజన ప్రక్రియ ద్వారా ఒక పిండముగాను, ఒక శిశువుగాను తయారై ఈ లోకములోనికి వస్తుంది. ఒక సగటు మానవునిలో దాదాపు 30-50 ట్రిలియన్ల కణాలు ఉంటాయి. ఈ కణాలు సమూహాలుగా ఏర్పడి కణజాలాలుగాను, అవయవములుగాను, వ్యవస్థలు గాను ఏర్పడి ఒక దేహాన్ని నిర్మిస్తాయి. దేహములోని ఈ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయడానికి వాటికి అవసరమైన త్రాగేనీరు, భుజించే ఆహారం, నివసించే పరిసరాలలో దేహానికి హానికరాలైన కాలుష్యాలు లేకుండా ఉండడం చాలా ప్రాముఖ్యం.

దేవుని వాక్యంలో విశ్వాసి దేహం చాలా విలువైనది గాను, పరిశుద్ధమైనదిగాను వివరించబడింది. 1 కొరింథీ 6:15,19 వచనాల్లో ఈ భౌతిక దేహము యొక్క విలువను దేవుడు ఎంతగా హెచ్చించాడో గుర్తించగలం. ఈ దేహము క్రీస్తు ప్రభువు అవయవముగాను (15వ), దేవుని వలన అనుగ్రహించబడినదిగాను (19వ), దేవుని ఆలయముగాను (19వ) వివరించబడింది.

ఈ సజీవ దేవాలయం ఆరోగ్యంగా, తన పని నిర్వర్తించాలంటే తగిన పోషక పదార్థాలుగల ఆహారం తినాలి. దేహానికి హాని కలిగించే పదార్థాలు ఆహార పదార్థాల రూపంలోనికి వెళ్ళకుండా నిషేధించాలి (ప్రసంగి 11:10). ఈ దేవాలయం యొక్క ఆకారం ఊబకాయంగా మారకుండా చూసుకోవాలి. అలా పెంపొందించే నూనెలు, క్రొవ్వు పదార్థాలు ఆపు చేయాలి. మన గుండె, ఊపిరితిత్తులు, మెదడు, కండరాలకు ఆక్సిజన్ సరఫరా మంచిగా జరగటానికి వ్యాయామం తప్పనిసరి. అతిగా పొట్టపెరగడం అనారోగ్యానికి సూచన. స్థూలకాయులు, పొట్టగల గ్రాడ్యుయేట్స్ దేవుడు తమకు అనుగ్రహించిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేస్తూ మితిమీరి తినడానికి అల వాటుపడ్డారని అది పరిచర్యకు గొప్ప ఆటంకమని, అనారోగ్య సూచనని గుర్తించాలి (1 కొరింథీ 6:12). మాంసాహారాపేక్ష కొందరికి ఒక వ్యసనము. ఆరాధనకు వెళ్ళకపోయినా, ఆలస్యంగా వెళ్ళినా బాధపడరు కానీ ఆదివారం మాంసాహారం లేకపోతే వారు చూపే చికాకు, అసహనం వారి విలువలను బహిర్గతం చేస్తుంది.

## దేహ ఆరోగ్యం కోసం కొన్ని మంచి అలవాట్లు

1. త్వరగా పండుకొని ప్రాత:కాలముననే లేచి దినమును ఆరంభించాలి. కనీసం 6-7 గం॥ల నిద్ర, దేహానికి ఇవ్వకపోతే శరీర వ్యవస్థలలో జరగాల్సిన పునర్నిర్మాణక్రియకు అంతరాయం ఏర్పడి తమ నైపుణ్యతను కోల్పోతాయి.

> అనారోగ్యకరమైన మనస్సులో తన్నుతాను ఎంచుకొనవలసిన దానికంటే ఎక్కువగా ఎంచుకోవడం జరుగుతుంది (రోమా 12:3). తద్వారా తోటి సహోదరుల ను తృణీకరించడం, గర్వహృదయం, విమర్శ, అసూయ, గ్రూపిజం మొదలగు రోగ సూచనలు కనపడతాయి. ఈ అనారోగ్యాన్ని పోగొట్టుకోవడానికి విశ్వాసి దేవుని దగ్గర తనను తాను స్వపరీక్ష చేసుకొని, రోగ కారణాలు గుర్తించి, పాపమును ఒప్పుకొని, ప్రభు రక్తములో కడిగివేసుకోవడం ఒకటే మార్గం.

2. ప్రాత:కాలము 5 గం॥లకు దినమును ప్రారంభించుట వలన సకాలంలో కాలకృత్యాలు ముగించుటకు, దినమును అర్థవంతంగా ప్లాన్ చేసుకోవడానికి, దేవునితో యదార్థంగా సమయం గడపటానికి, వ్యాయామానికి వీలుకలుగుతుంది.
3. ఆహార సమయాలను క్రమం తప్పకుండా పాటించటం వలన ఉదర సమస్యల నుంచి కాపాడుకొనవచ్చు. ఉదా. ఎసిడిటి (ఆమ్ల ఉదరం)
4. వారానికి ఒకపూట ఉపవాసము ఉండటం అల వాటు చేసుకోవడం చాలా ప్రయోజనకరం.

## మానసిక ఆరోగ్యం

దేహ ఆరోగ్యం కన్నా మానసిక ఆరోగ్యం చాలా ప్రాముఖ్యం. దైవగ్రంథంలో రాయబడిన, "బుద్ధివచ్చినప్పుడు", "స్వస్థబుద్ధి" అనే మాటలు మానసిక ఆరోగ్యం గురించి చెప్పినవే! దేవుడు



మానవునికిచ్చిన మానసిక వ్యవస్థ చాలా అద్భుతమైనది. మానవునిలోని 'అసలు వ్యక్తి' మనస్సులోనే ఉంటాడు. ఈ వ్యక్తి యొక్క మానసిక ప్రతిస్పందనే ప్రవర్తన రూపంలో బయటకు వ్యక్తమవుతుంది. మనస్సు ఆరోగ్యంగా లేకపోతే అతని ప్రవర్తన కూడా దానికనుగుణంగానే ఉంటుంది. మనస్సులో మన ఇష్టాయిష్టాలు, భావోద్రేకాలు, నిర్ణయాలు, దృక్పథాలు, అభిప్రాయాలు, ఆలోచనలు, కోరికలు, ఉద్దేశాలు ఇలా మన ప్రవర్తనను, ఎంపికలను శాసించే అనేక విషయాలు ఉంటాయి. ఈ మనస్సు ఆరోగ్యంగా ఉంటే దాని నుంచి వచ్చేవన్నీ మంచిగా ఉంటాయి. లేకపోతే అవి ఆ వ్యక్తికి, అతని చుట్టూ ఉండే సమాజానికి హాని కలిగించేవిగా పరిణమిస్తాయి. మన మనస్సే మన వ్యక్తిత్వానికి మూలం, మన ప్రవర్తనకు కారణం.

## ఆత్మ యొక్క ఆరోగ్యం

మానవ ఆత్మ రక్షణ కార్యం ద్వారా దేవునితో కలపబడి పునరుజ్జీవింపబడుతుందని మనకు తెలుసు. ఆత్మీయ ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం చాలా దగ్గర సంబంధం కలిగి ఉంటాయి. ఆత్మయొక్క ఆరోగ్యం దేవుని ఆత్మతో మన ఆత్మకు గల "సహవాసం"పై ఆధారపడి ఉంటుంది. దేవునితో సహవాసం చేసే ఆత్మ మనస్సుపై తన అధికారాన్ని కలిగి ఉంటుంది. తద్వారా మనస్సు శరీరాన్ని లోబరచుకొనగలదు. దేవుని ఆత్మతో సహవాసం చేసే మానవ ఆత్మలో రూపాంతర క్రియ జరుగుతూ ఉంటుంది (రోమ12:2).

రోమ 12:1-2 వచనాల్లో శరీరము, ప్రాణము,



ఆత్మల ఆరోగ్యం గురించి అద్భుత విషయాలు రాయబడ్డాయి. మౌళికంగా శరీరం మనస్సు ఆధీనంలో ఉండి పనిచేయాలి. కానీ శరీరంలోని పాపస్వభావం దానికి అంగీకరించక తిరుగుబాటు చేస్తుంది. తద్వారా "నా ఇష్టం" అనే కేక పాపస్వభావం ద్వారా మనస్సును ప్రభావితం చేస్తుంది. ఇక్కడ మనస్సు పాత్ర చాలా కీలకం. ఆరోగ్యవంతమైన మనస్సు ఆత్మ అధికారానికి లోబడుతుంది. అనారోగ్య మనస్సు ఆత్మ అధికారానికి లోబడక 'నా ఇష్టం' అనే కేకకు వంతపాడుతుంది. తద్వారా తప్పుడు నిర్ణయాలు, తప్పుడు దృక్పథాలు, తప్పుడు ఆశలు, తప్పుడు కోరికలు, తప్పుడు భావోద్రేకాలకు కారణం అవుతుంది.

స్వస్థబుద్ధిగల మనస్సు అనగా ఆరోగ్యవంతమైన మనస్సు, ఆత్మ అధికారానికి అంగీకరించి దేవుని వాక్యంలోని సత్యాన్ని గ్రహించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుంది. తద్వారా మంచి భావోద్రేకాలు, మంచి ప్రవర్తన బహిర్గతమవుతాయి.

అనారోగ్యకరమైన మనస్సులో తన్నుతాను ఎంచుకొనవలసిన దానికంటే ఎక్కువగా ఎంచుకోవడం జరుగుతుంది (రోమా 12:3). తద్వారా తోటి సహోదరులను తృణీకరించడం, గర్వహృదయం, విమర్శ, అసూయ, గ్రూపిజం మొదలగు రోగ సూచనలు కనపడతాయి. ఈ అనారోగ్యాన్ని పోగొట్టుకోవటానికి విశ్వాసి దేవుని దగ్గర తనను తాను స్వపరీక్ష చేసుకొని, రోగ కారణాలు గుర్తించి, పాపమును ఒప్పుకొని, ప్రభు రక్తములో కడిగివేసుకోవడం ఒకటే మార్గం.

మానసిక రోగాలు అనేక రకాలు. మనస్సుకు సమాచారం అందించే జ్ఞానేంద్రియాల విషయంలో జాగ్రత్త వహించకపోతే, ఈ "చెడు సమాచారం అనే వైరస్" మనసును కలుషితం చేసి పాపము చేత మానసిక అనారోగ్యానికి దారితీస్తుంది.ఉదా. సెల్‌ఫోన్ నుంచి వచ్చే దృశ్య, శ్రవణ సమాచారం అపవిత్రమైనదైతే అది మనస్సులో ప్రవేశించి పాపపు తలంపులను కలుగజేసి అనారోగ్యానికి నడిపిస్తుంది. కొన్నిసార్లు మనస్సులో ప్రవేశించే అబద్ధాలు మనస్సును కృంగదీసి, భయానికి, ఆందోళనకు కారణమై తీవ్ర కృంగుదలకు (డిప్రెషన్) దారి తీయవచ్చు. మరికొన్నిసార్లు



దృష్టిద్వారా వచ్చిన సమాచారం మనస్సులోని లైంగిక భావోద్రేకాలను రెచ్చగొట్టి కృంగుదలకు గానీ, ఉన్మాదమునకు గానీ నడిపించగలవు. స్త్రీ, పురుషుల మధ్య ఏర్పడే కొన్ని చెడు సంబంధాలకు 'ప్రేమ' అనే అబద్ధపు పేరు పెట్టడానికి కారణం అనారోగ్యమైన మనస్సే.

ఈ మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి దేవుడు అనుగ్రహించిన అద్భుతమార్గం రోమా 12:2లో వివరించబడింది. రెండోవచనంలోని 'దేవునిచిత్తం' అనే పదం చాలా ప్రాముఖ్యమైనది. ఇది మానసిక ఆరోగ్యానికి కావలసిన ఆహారం మరి యు అనారోగ్యానికి మందు కూడా. దేవుడు దీనిని ప్రతి విశ్వాసికి ఎంతో సమృద్ధిగా అందుబాటులో ఉంచినా కూడా అబద్ధం అనే కాలుష్యాన్ని ఆహారంగా తీసుకొని అనారోగ్యం పాలైన వందలాది ఇయు విద్యార్థులను, గ్రాడ్యుయేట్స్‌ను గమనించగలం. వారి ఎంపికలలో, విలువలలో, ఆశలలో, అభి లాషలలో, ప్రణాళికలలో, దృక్పథాలలో ఈ మానసిక రోగ లక్షణాలను చూడగలం. దానినే రోమా 12:2 'లోక మర్యాద' అని, ఎఫెసీ 2:2 'ప్రపంచ ధర్మము' అని సంబోధిస్తుంది. ఇది సాతానుడు విశ్వాసిని బలహీనపరచటానికి లోక వ్యవస్థ ద్వారా అందించు చక్కెర పూతపూసిన చేదు విషం. ఇది సమాచార రూపంలో మనస్సులోకి జ్ఞానేంద్రియాల ద్వారా వెళ్ళి మనస్సును రోగగ్రస్తముగా చేస్తుంది.

చేదు మొక్కలలాంటి ఈ అబద్ధాలను మూలాలతో పీకి పారెయ్యడానికి పరిశుద్ధాత్మ దేవుడు వాడే మందు, ఆహారం దేవుని సత్యం. దానినే దేవుని చిత్తం అని రోమా 12:2 ప్రస్తావిస్తుంది. ప్రతి విశ్వాసి ఉత్తమం, అనుకూలం, సంపూర్ణమైన ఈ సమాచారాన్ని మన మనస్సులోనికి ఆత్మదేవుని సహాయంతో గ్రహించుటవలన మన మనస్సులో ఆరోగ్యం తిరిగి నెమ్మదిగా అభివృద్ధి చెంది స్వస్థత పొందుకొని రూపాంతరం చెందుతుంది.

మనస్సు యొక్క ఆరోగ్యం, దేహము యొక్క ఆరోగ్యాన్ని కూడా అభివృద్ధి చేస్తుందని దేవుని వాక్యం చెబుతుంది.

విచారమువలన నా కన్ను క్షీణించుచున్నది నా ప్రాణము, నా దేహము క్షీణించుచున్నవి - కీర్తన 31:9

యెహోవాయందు భయభక్తులుగలిగి చెడు తనము విడిచిపెట్టుము. అప్పుడు నీ దేహమునకు ఆరోగ్యమును నీ యెముకలకు సత్తువయు కలుగును. - సామె 3:8

నీ దేహమును శిక్షకు లోపరచునంత పని నీ నోటివలన జరుగనియ్యకుము. - ప్రసంగి 5:6

లేతవయస్సును నడిప్రాయమును గతించిపోవునవి గనుక నీ హృదయములోనుండి (మనస్సు) వ్యాకుల మును తొలగించుకొనుము, నీ దేహమును చెరుపుదాని తొలగించుకొనుము. - ప్రసంగి 11:10

నీ దేహమునకు దీపము నీ కన్నే గనుక, నీ కన్ను తేటగా నుంటె నీ దేహమంతయు వెలుగు మయమై యుండును; అది చెడినదైతే నీ దేహమును చీకటిమయమై యుండును. - లూకా 11:34

ప్రియమైన గ్రాడ్యుయేట్/సహోదరుడా, సహోదరీ, ఇయు విద్యార్థి, ఆరోగ్యం కేవలం దేహానికి మాత్రమే పరిమితం కాదు. వైరస్ అంటే భయపడి మాస్క్ ధరిస్తూ, ఎప్పటికప్పుడు చేతులు కడుక్కుంటున్నట్లే, పాపం యొక్క ఉనికిని గుర్తిస్తూ, అపవిత్రమైన అబద్ధాన్ని లోనికి రానీయకుండా జ్ఞానేంద్రియాలకు మాస్క్ ధరించి, ఎప్పటికప్పుడు పాపమనే కాలు ష్యాన్ని ప్రభువు రక్తంలో కడిగివేసుకొంటూ ఆత్మకు, శరీరానికి, ప్రాణానికి అంటిన సమస్త కల్మషం నుంచి మనలను పవిత్రులుగా చేసుకుందాం (2 కొరింథీ 7:1). పరిశుద్ధమైన, కాలుష్యం లేని వాతావరణం అనే దేవుని సన్నిధిని అభ్యాసం చేద్దాం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని శరీరానికి, ఆరోగ్యకరమైన దైవ సత్యాన్ని మనస్సుకు సమృద్ధిగా అందించి, సాతానును, పాపాన్ని ఎదిరించి నిలువగల ఆరోగ్యవంతులంగా దేవుని కొరకు జీవిద్దాం.

**– డా. కె. పరిమళాదేవి,** గుంటూరు
రిటైర్డ్ సీనియర్ ఆప్తల్మాలజిస్ట్,
గుంటూరు జనరల్ హాస్పిటల్

కథానిక

# ఈ సంవత్సరం కూడా ఉండనిమ్ము!!



ఎక్కడెక్కడి నుంచో వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులతో ఆ హాలు నిండిపోయింది. మైక్‌లో నుంచి వస్తున్న పాటలు ఆ ప్రాంతాన్ని సమ్మోహనంగా మార్చుతున్నాయి.

రాజశేఖర్ అనే విద్యార్థి బృందం స్కిట్ మొదలైంది. తప్పు చేయడం సులభం, తప్పించుకోవడం కష్టం. ఇతరులకు తెలియకుండా పాపపు పనులు చేయడం సులువు, కానీ దాని వల్ల ప్రతి ఫలాన్ని అనుభవించడం చాలా కష్టం. హాస్టల్లో ఉండే విద్యార్థులు పాపంలో చాలా సులువుగా పడిపోతారు. స్నేహితుల ప్రభావం, పరిసరాల ప్రభావం, పెద్దల అదుపులో లేకపోవడం, తప్పు చేసినా ఎవరికీ తెలియదనుకోవడం విద్యార్థుల్ని మరింత పాపంలోకి లాగుతుంటుంది.

రాజశేఖర్ బృందం చేస్తున్న స్కిట్ విద్యార్థుల్లో ఏదో తెలియని అపరాధ భావాన్ని కళ్ళముందు నిలుపుతోంది. అమ్మానాన్నలతో అబద్ధాలు చెప్పి డబ్బులు తీసుకోవడం, ఆ డబ్బుల్ని వ్యసనాలకు ఖర్చు చేయడం, డ్రగ్స్, బెట్టింగ్స్, డ్రింకింగ్ లాంటి వాటి వలలో పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్న విద్యార్థుల్ని ఉద్దేశించి సాగుతున్న స్కిట్ అందరిలోనూ పశ్చాత్తాపాన్ని కలిగించసాగింది.

సరదాగా మొదలైన స్కిట్ విషాదంగా ముగిసింది. అలవాట్లు మొదట్లో సాలెగూళ్ళు, తర్వాత సంకెళ్ళు అన్నట్లుగా సాగిన స్కిట్ అంతరార్థం గ్రహించేసరికి విద్యార్థుల కళ్ళల్లో చెమ్మ చేరింది.

పక్కనున్న వాళ్ళు చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు సైమన్. ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న సైమన్ చిన్నప్పటి నుంచీ చర్చిలోనే పెరిగాడు. క్రిస్మస్ సమయంలో చర్చి వదలకుండా ఉండేవాడు. డిసెంబర్ ఆఖరి రోజు మొత్తం బైబిల్ పఠనంలోనూ, ఆ రాత్రంతా హోల్ నైట్ ప్రేయర్‌లోనూ గడిపినవాడే.

కానీ ప్రస్తుత పరిస్థితి అతని అలవాట్లను మార్చేసింది. మొదటి రెండేళ్లు చాలా పద్ధతిగానూ, దేవుడికి దగ్గరగానూ గడిపిన సైమన్ కాలక్రమంలో స్నేహితులకు దగ్గరయ్యాడు. వాళ్ళతో కలిసి హోటళ్ళకు వెళ్ళడం, సినిమాలు, షికార్లకు వెళ్ళడం అలవాటైంది. అమ్మాయిల్ని ఎప్పుడూ పవిత్రభావంతో చూసే సైమన్‌కు క్లాస్మేట్ సంధ్యతో పరిచయం అయ్యింది.

ఆ పరిచయం అతనికి కొత్త అలవాట్లను నేర్పింది. సమయానికి నిద్ర ఉండట్లేదు. తిండి మీద ధ్యాస ఉండట్లేదు. ఆ అమ్మాయి మెసేజ్ కోసమో, ఫోన్ కోసమో ఎదురుచూపులు ఎక్కువయ్యాయి. ఆమె కనిపిస్తే చాలు... ఆ రోజు ఆనందంగా ఉండేది. ఆమె కనిపించకపోతే ఆ రోజంతా ఏదో తెలియని వెలితిగా గడిపేవాడు.

'ఎప్పుడూ... అక్కడ బైబిల్ స్టడీ ఉంది, ఇక్కడ బైబిల్ స్టడీ ఉంది రమ్మని' పిలిచే రాజేష్ కనిపిస్తే తప్పించుకు తిరగడం అలవాటు చేసుకున్నాడు. దాదాపు అతనికి ఎదురుపడకుండా జాగ్రత్త పడేవాడు. కానీ ఆరోజు రెండవ శనివారం కావడంతో రాజేష్ ఎదురుపడ్డాడు. తప్పించుకోవడానికి వీల్లేకపోయింది. ఏ కారణం చెప్పి తప్పించుకోవాలో అర్థం కాలేదు. సంధ్యతో కలిసి ఫుడ్ కోర్ట్‌లో కావలసింది తిని ఆమెతో కబుర్లు చెప్పుకోవడానికి ప్లాన్ చేసుకున్నాడు. కానీ అనుకోకుండా రాజేష్ కనబడడంతో తడబడ్డాడు.

"సాయంత్రం ఐదున్నరకు మనకు సెమీ క్రిస్మస్, నూతన సంవత్సర మెసేజ్ ఉంది. వెళ్దాం" అన్నాడు రాజేష్.

"అన్నా... అదీ ... అదీ" నీళ్ళు నమిలాడు సైమన్.

"ఏం.. ఒంట్లో బాగోలేదా" అన్నాడు రాజేష్.

"బాగానే ఉందన్నా... కానీ..." చెప్పలేక పోయాడు.

"సరే... నీ పనులు నీకుంటాయి. కాదనను. కాకపోతే మొదట్లో బైబిల్ స్టడీస్ అంటే చాలా చురుగ్గా ఉండేవాడివి. రానురానూ నీలో ఏదో మార్పు కనిపిస్తోంది. ఏమైందో నేను అడగను. సాయంత్రం నీ దగ్గరికి వస్తా. రెడీగా ఉండు..." చెప్పి వెళ్ళిపోయాడు రాజేష్.

కన్ను కోరుతోంది, కాలు లాగుతోంది, బుర్ర ఊగుతోంది, బుద్ధి మారుతోంది! బుర్ర ఎటు తిప్పాడో గుర్తులేదు, కానీ రాక తప్పలేదు.

"ఇప్పుడు మిమ్మల్ని కొన్ని చిన్న చిన్న ప్రశ్నలు అడుగుతాను. వాటికి టకటకా సమాధానాలు చెప్పండి" అన్నాడు పాల్ అన్న.

క్రిస్మస్ వేడుకకు హాజరైన విద్యార్థులంతా ఆసక్తిగా చూశారు. కొంతమంది 'ఏమడుగుతాడో' అని భయంగా చూశారు. సైమన్ ఆలోచనల్లోంచి బయటికి వచ్చి పాల్ అన్న వైపు చూశాడు.

"పెన్నెందుకు?"

'రాయడానికి...' అందరూ ముక్త కంఠంతో చెప్పారు.

"పుస్తకం ఎందుకు?"

'రాసుకోవడానికి...' మళ్ళీ అందరూ ఉత్సాహంగా చెప్పారు.

"ఫ్యాన్ ఎందుకు?"

'గాలినివ్వడానికి...' విద్యార్థులంతా కోరస్ పాడారు.

"నువ్వెందుకు?"

'????'

హాలంతా నిశ్శబ్దమై పోయింది. విద్యార్థులంతా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. ఏం చెప్పాలో తెలియక అయోమయంగా మారిపోయారు.

కొన్ని ప్రశ్నలకు సమాధానాలు తెలిసినట్లే ఉంటాయి. కానీ ఎక్కడ నుంచి మొదలుపెడితే పద్ధతిగా ఉంటుందో అర్థం కాదు.

"ఏంటి అందరూ అలా సైలెంట్ అయిపోయారు. నువ్వెందుకు ఉన్నావో నీకు తెలియట్లేదా? ఎందుకు పుట్టావో, ఎందుకు పెరుగుతున్నావో, ఎందుకు తిరుగుతున్నావో, అసలెందుకు బతుకుతున్నావో నీకు తెలియట్లేదా?"

పాల్ అన్న గొంతు మైక్‌లో ఖంగున మోగుతోంది.

"అన్నీ వదులుకుని నీ కోసం పరలోకం నుంచి వచ్చిన దేవుడు నీకు గుర్తు రావట్లేదా? దేవుడు ఉండాల్సిన గుండెనిండా ఎవరెవరినో కొలువుంచి పూజిస్తున్నారు. కొంతమంది గుండెల్లో అమ్మాయిలు, మరికొంతమంది గుండెల్లో వ్యసనాలు, ఇంకొంతమంది గుండెల్లో ఏవేవో అలవాట్లు... వీటికోసమే బతుకుతూ, వీటికోసమే తిరుగుతూ జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు.."

విద్యార్థులంతా ఒంటిని తాకుతున్న చల్లగాలిని మర్చిపోయారు. ప్రవాహంలా సాగుతున్న ప్రసంగాన్ని వింటూ తమలో తాము తర్జన భర్జన పడుతున్నారు.

"దేవుడు నీ కోసమే వచ్చాడు. నిన్ను రక్షించడానికి తన ప్రాణాన్ని పెట్టాడు. నిన్ను నువ్వు సరిచేసుకుని, నీ పాప స్వభావాన్ని విడిచిపెట్టి తిరిగి వస్తే ప్రేమగా హత్తుకోవాలని ఎదురు చూస్తున్నాడు. సంవత్సరాలు గడిచిపోతున్నా ఫలించని నిన్ను చూసి దేవుడు రోదిస్తున్నాడు. ఈ సంవత్సరమైనా నువ్వు ఫలిస్తావని ఆశగా ఎదురుచూస్తున్నాడు. ఇప్పటికైనా మనసు మార్చుకుని దేవుని ప్రేమను గుర్తిస్తేనే నీకు క్రిస్మస్ విలువ తెలుస్తుంది. దేవుని హత్తుకుని జీవిస్తేనే నీలో నూతన సంవత్సరం మొదలవుతుంది. రండి.. మన తప్పుల్ని ఇక్కడే విడిచిపెడదాం. దేవునితో కలిసి నడవాలని వాగ్దానం తీసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం" వాక్య సందేశం ముగించి ప్రార్థన చేయడానికి ఉపక్రమించాడు పాల్ అన్న.

విద్యార్థులంతా తలలు వంచి ప్రార్థించుకోసాగారు.

సైమన్ మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది. గత జీవితమంతా కళ్ళ ముందు నిలిచింది. నిజమే... సంవత్సరాలు వస్తున్నాయి, పోతున్నాయి. తాను మాత్రం ఫలించని అంజూరపు చెట్టులాగే ఉంటున్నాడు. కన్నీళ్ళు ధారలు కారుచుండగా కళ్ళు మూసుకుని "ప్రభూ, నువ్విచ్చిన పనులు మానేసి నాకు నచ్చిన పనులు చేయడంలోనే సంవత్సరం గడిచిపోయింది. వెనక్కి తిరిగి చూస్తే వేదనతో కూడిన రోజులు గుర్తొస్తున్నాయి. పనికిరాని వాటికోసం పాకులాడిన క్షణాలు మదిలో మెదులుతున్నాయి. అయినా నన్ను క్షమించావు. కాపాడుతున్నావు. నూతన సంవత్సరాల్ని బహుమతిగా ఇస్తున్నావు. ఈ సంవత్సరమైనా నేను ఫలించడానికి నీ కృపను దయచేయండి. నిన్ను వెంబడించడానికి సహాయం దయచేయి" అని ప్రార్థించాడు.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు.

# క్రీస్తు మనసు - సహవాసంలో ఐక్యత

**ఫిలిప్పీ 2:1-11**

తండ్రి దగ్గరకు కుమారుడు వచ్చి "నాన్న నాకు, చెల్లికి అన్నీ ఇచ్చేశావు మరి నీకేమీ లేవని బాధపడుతున్నావా?" అని అడిగితే ఆ తండ్రి చిన్నగా నవ్వి ఎంతో సంతృప్తితో "మీకు అన్నీ ఇచ్చేసినా కూడా "నేను నేనే కదా" అని అంటాడు. ఆదిసంభూతుడు, అనంతుడైన క్రీస్తు మానవాళిని ప్రేమించి, తన కంటే, పసుల కంటే ప్రతి మానవుని యోగ్యునిగా ఎంచి తన స్థితిని, హోదాను, ఆధిక్యతలను పక్కన పెట్టి, రిక్తుడిగా చేసుకొని, మానవునిగా, దాసునిగా జన్మించి, పరి శుద్ధంగా జీవించి, ఘోరమైన, శాపగ్రస్తమైన సిలువ మరణం పొంది మనం కోల్పోయిన, పోగొట్టుకొన్న స్థితిని, సంబంధాన్ని మరలా ఇచ్చారు.

ఈ విధంగా వినయంతో స్వయం సమృద్ధి కలిగిన, దైవ మానవుడైన యేసు మానవుని ప్రేమించి తండ్రికి తనను తాను విధేయతతో అప్పగించుకొన్నాడు. ఈ మనసు కలిగిన ప్రభువు మనకెంతో మాదిరి. తద్వారా తన దైవత్వాన్ని అనుమానిస్తారని, అవమానిస్తారని తెలిసి కూడా గుర్తింపు కోసం ప్రాకులాడలేదు, మనుషుల మెప్పుకోసం జీవించలేదు, ప్రతి చోట నిరూపించుకోవడానికి అసలు ప్రయత్నించలేదు.

**నేపథ్యం:** క్రీస్తు నిమిత్తం, సువార్త నిమిత్తం చెరసాలలో బందీగా ఉన్న పౌలు ప్రభువులో ఆనందిస్తూ రెండవ మిషనరీ ప్రయాణంలో యూరప్ ఖండంలో స్థాపించిన మొదటి సంఘమైన ఫిలిప్పీ సంఘానికి ఉత్తరం రాస్తూ అకారణంగా తోటి వారిని ద్వేషించక, ఇతరుల మెప్పు కోసం, పోటీ తత్వంతో కాక ప్రతి వ్యక్తిని నీకంటే యోగ్యునిగా, విలువైన వానిగా ఎంచుకోవాలని, వైఖరిలో, క్రియలలో కూడా తోటి వారికి ప్రాధాన్యత ఇస్తూ సహవాసంలో ఎంతో ప్రాముఖ్యమైన ఏక మనసు, ఐక్యత కొరకు పాటుపడాలని తెలియజేశాడు. ఇందుకుగాను త్రియేక దేవుడు పౌలుకు తెలియజేసిన సర్వపరిపూర్ణుడైన, మహోన్నతుడైన యేసు యొక్క మనసు/వైఖరి అందరికి మాదిరిగా ఉండాలని స్పష్టంగా వివరించాడు.

## ప్రశ్నలు

1. ప్రస్తుత సంఘం, సహవాసంలో వేటి మీద ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు? ఎందుకు? సహవాసంలో ప్రాముఖ్యమైనవి ఏంటి? ఎందుకు?
2. ఏకమనసు కలిగి జీవించడం అంటే ఏంటి? ఐక్యత ఎందుకు కలిగి ఉండాలి? ఏమి ఉంటే ఐక్యతను కలిగి ఉండగలమని పౌలు బోధిస్తున్నాడు?(1,2)
3. తోటి వ్యక్తిని యోగ్యునిగా ఎంచడంలో అడ్డు వచ్చేవి ఏంటి? ఎందుకు?(3,4) తోటి వ్యక్తిని యోగ్యునిగా ఎంచితే కలిగే ఫలితాలు ఏంటి?(2)
4. క్రీస్తుయేసు ఎలాంటి మనసు/వైఖరి కలిగి ఉన్నాడని పౌలు రాస్తున్నాడు?(5-8)
5. రిక్తునిగా చేసుకోవడం అంటే ఏంటి? క్రీస్తు ఎందుకు రిక్తునిగా చేసుకొన్నాడు?(6-8)
6. ఆయన వైఖరి, మన వైఖరిని ఎలా సవాలు చేస్తుంది?
7. క్రీస్తు మాదిరి నుండి ఏ లక్షణాలను నేర్చుకోగలం? క్రీస్తు మాదిరి నిన్ను ఏ విధంగా పురికొల్పి, ప్రోత్సహించి, హెచ్చరించి, సవాలు చేస్తుంది?
8. కుమారుని విధేయత చూసి తండ్రి అయిన దేవుడు కుమారుని ఏవిధంగా ఘనపరుస్తున్నాడు? (9-11)
9. సహవాసంలో ఐక్యత లోపించిందని ఎలా గుర్తించగలం? యేసు మనసును కలిగి జీవిస్తున్న వ్యక్తి సహవాసం, సమాజంపై ఎలాంటి ప్రభావాన్ని చూపించగలడు?
10. ఇటీవల కాలంలో సహవాసంలో ఐక్యతను పెంపొందించడానికి నీవు చేసిన ప్రయత్నాలు ఏంటి? అందుకు ఎదురైన ఆటంకాలు ఏంటి? వాటిని అధిగమించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశావు? ఎటువంటి ప్రయత్నాలు చేస్తే మంచి ఫలితాలను చూడగలము?

మన పట్ల, దేవుని పట్ల మన వైఖరిని సిలువ విప్లవాత్మకంగా మారుస్తుంది - జాన్‌స్టాట్

- బి. తబిత రాజ్‌కుమార్, స్టాఫ్, తిరుపతి



# క్రైస్తవ దాతృత్వం

## బైబిల్, వేదాంతపరమైన విశ్లేషణ

**గత సంచిక తర్వాత...**

**బి. దేవుని ప్రేమ పట్ల మన బాధ్యతాయుతమైన ప్రతిస్పందన:**

దేవుడు మన పట్ల చూపిన గొప్ప ప్రేమను బట్టి మనం "కృతజ్ఞతా భావంతో నిండి ఉండాలి". మొదటిగా, మనల్ని మనం హృదయపూర్వకంగా "ఆయనకు సమర్పించుకొనుట ద్వారా లేదా మన నిమిత్తం మృతిపొంది తిరిగి లేచినవాని కొరకే జీవించుట ద్వారా" మనం ఆయన పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేయాలి. పౌలు ఇదే విషయాన్ని రోమా 12:1 మరియు 2 కొరింథీ 5:14-15లో తెలియజేస్తున్నాడు: "కాబట్టి, సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాక్యమును బట్టి మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది".

మనల్ని మనం ప్రభువుకు ఇలా సమర్పించుకోవడం (సజీవయాగంగా)[9] కాకుండా ఆయనకు మనం ఇంక ఏమి చేసినా అది అనుకూలమైనది కాదు, యుక్తమైనది కాదు. 2 కొరింథీ 5:14-15లో పౌలు ఇలా అంటున్నాడు: "జీవించువారిక మీదట తమ కొరకు కాక తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచిన వానికొరకే జీవించుటకు ఆయన అందరి కొరకు మృతిపొందెననియు నిశ్చయించుకొనుచున్నాము". అందుకే పౌలు మాసిదోనియా సంఘస్తులను అభినందిస్తున్నాడు, పొగుడుతున్నాడు, వారు ఇతరులకు మాదిరిగా ఉన్నారని తెలియజేస్తున్నాడు. అవసరతలో ఉన్న విశ్వాసుల నిమిత్తం వారు ఇష్టపూర్వకంగా, సంతోషంగా, త్యాగపూరితంగా, ధారాళంగా ఇచ్చారని పౌలు తెలియజేస్తున్నాడు. "ఇదియు గాక మొదట ప్రభువునకును, దేవుని చిత్తము వలన మాకును తమ్మునుతామే అప్పగించుకొనిరి. ఇంతగా చేయుదురని మేమనుకోలేదు" (2 కొరింథీ 8:5) అని పౌలు తెలియజేస్తున్నాడు. మనం దేవునికి పరిపూర్ణంగా సమర్పించుకొన్నప్పుడు, మన సమయం, మన తలాంతులు, మన ధనం కూడా ప్రభువుకు సమర్పించినట్లే. ఇక అవి ఆయనవే. ఆయన సేవకులమైన మనము ఆయన మనకు ఇచ్చిన వాటన్నిటికీ గృహనిర్వాహకులం. ఆయన మనకు ఇచ్చిన వనరులన్నిటిని ఆయన మహిమార్థం మాత్రమే ఉపయోగించాలి. మన

9. This 'whole-life worship' is reflected in the transformed thinking and living, which is counter-cultural thinking and living (Romans 12: 2-21). This should help us to understand the truth that worship is not just about the words and songs (the fruit of our lips) we offer to God in the Church building on a Sunday or in our homes in prayer meetings, but more importantly about the way we live (the fruit of our lives, the transformed living) from Monday to Saturday in our homes, neighborhoods, workplaces, and everywhere else. This is the 'reasonable worship' that is expected of us and pleasing and acceptable to the Lord.

ప్రాధాన్యతలకు అనుగుణంగా మనం దేవుని పరిచర్యకు ఇవ్వాలి.

మనం దేవుని పట్ల కృతజ్ఞతను తెలియజేసే క్రమంలో, రెండవ విషయం ఏంటంటే, ఇతరులను ప్రేమించడం. 1 యోహాను 4:11లో యోహాను ఈ విషయాన్నే తెలియజేస్తున్నాడు: “ప్రియులారా, దేవుడు మనలను ఇలాగు ప్రేమింపగా మనమొకనినొకడు ప్రేమింప బద్ధులమై యున్నాము”. మనల్ని తన పిల్లలుగా చేసుకొనేంతగా దేవుడు మనల్ని ప్రేమించాడు (1 యోహాను 3:1-2). మనం మరణములోనుండి జీవములోనికి దాటియున్నామని, మనం దేవుని పిల్లలమని, అపవాది పిల్లలం కామని అనడానికి ఉన్న గొప్ప రుజువులలో ఒకటి ఏమిటంటే, మనం మన సహోదరులను ప్రేమించడం (1 యోహాను 3:10,14). ఇది భావ ప్రకటనకే పరిమితమయ్యే ప్రేమకాదు. అవసరతలో ఉన్నవారికి మన దగ్గర ఉన్న వస్తువులను ఇవ్వడం లేదా పంచుకోవడం. ప్రేమ ఈ రూపంలో వ్యక్తంకాకపోతే, దాని అర్థం దేవుని ప్రేమ మనలో లేనట్లే (1 యోహాను 3:16-24). ఈ విషయాన్ని ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రేమ పూర్వక దాతృత్వముగల దేవుని పిల్లలు తమ తండ్రివలె, ప్రేమ పూర్వక దాతృత్వాన్ని కలిగి ఉంటారు. మనం ఈ దేవుని పిల్లలమని చెప్పుకుంటూ, ఈ ప్రేమ పూర్వక దాతృత్వము మనలో లేకపోతే, మనలో భయంకరమైన సమస్య ఉన్నట్లే. మనం దేవుణ్ణి నమ్ముకున్నామని, ఆయన్ను ప్రేమిస్తున్నామని చెప్పుకుంటూ, మన తోటి సహోదర సహోదరీలను ప్రేమించకపోతే మనం అబద్ధికులమే (1 యోహాను 4:19-21). నిజానికి మనం ఒకరి పట్ల మరొకరం ప్రేమ చూపించుకొనుట ద్వారా మనం యేసుక్రీస్తు శిష్యులమని లోకానికి అర్థమౌతుంది (యోహాను 13:34-35). ఈ విషయంలో క్రీస్తు ప్రేమే మనకు ప్రమాణము[10]. ఇప్పటి వరకు మనం చూసిన విషయాల వెలుగులో మనల్ని మనం లోతుగా పరిశీలించుకుంటే, అది సువార్తకు, మనకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మనం మన ప్రేమను, దాతృత్వాన్ని చూపించాల్సింది దేవునివైపు, మనతోటి విశ్వాసులవైపు మాత్రమే కాదు, క్రీస్తును విశ్వసించని అవిశ్వాసుల పట్ల కూడా చూపించాలి.

దేవుని పట్ల కృతజ్ఞతాభావాన్ని కలిగి ఉండడంలోని మూడవ మరియు చివరి అంశం ఏంటంటే నశించిపోతున్న వారిపట్ల ప్రేమను చూపించడం. వారి ఆధ్యాత్మిక అవసరాన్ని తీర్చడం మన ప్రాథమిక కర్తవ్యమే అయినప్పటికీ, మనం మంచి సమరయునిలా ఉండాలేకానీ, యాజకునిలా, లేవీయునిలా ఉండకూడదని ప్రభువు కోరుకుంటున్నాడు (లూకా 10:25-37). యేసుక్రీస్తు బోధించిన ఆ ఉపమాన సారాంశము ఏమిటంటే, అవసరతలో ఉన్న ఏ వ్యక్తియైనా మన పొరుగువాడే. మంచి సమరయునిలా, మన ప్రభువైన యేసుక్రీస్తును బట్టి మనం వారి అవసరాలు తీర్చాలి. మంచి పనులను బట్టి మనం రక్షింపబడలేదు. అయితే, మంచి పనులు చేయడానికి దేవుడు మనల్ని రక్షించాడు (ఎఫెసీ 2:8-10). మంచి పనులు చేయడంలో మనం విసుగు చెందకూడదని, అవకాశం ఉన్న కొలది మనం అందరికీ, ముఖ్యంగా విశ్వాసులందరికీ మంచి చేయాలని పౌలు తెలియజేస్తున్నాడు (గలతీ 6:9,10).

### 3. క్రైస్తవ దాతృత్వము అనే ఈ ఆధ్యాత్మిక క్రమశిక్షణను అభ్యాసం చేయడం:

క్రైస్తవ జీవనశైలికి ఆధారం బైబిల్ సత్యాలే. ఎందుకంటే, మన విశ్వాసం, ప్రవర్తనలపై బైబిల్‌కు సంపూర్ణ అధికారం ఉన్నది. మొదటిగా మనం ఈ విషయానికి సంబంధించిన కొన్ని బైబిల్ ఆధారిత విషయాలను, తర్వాత వాటి అభ్యసనానికి ఉపయోగపడే కొన్ని సూచనలను మనం చూద్దాము[11].

10. In fact, the newness in Jesus' command is this standard of the way Jesus loved us. Minus this standard, this command is already there in the OT (Lev. 19: 18).

11. While working on this section, I have drawn some ideas and at times words and phrases also from Dennis J. Mock, Church Ministry, Administration and Education, A Course Manual (Atlanta: Bible Training Center For Pastors and Church Leaders, 1989), 58-64.

### ఎ) బైబిల్ ఆధారిత క్రైస్తవ దాతృత్వానికి సంబంధించిన కొన్ని సూత్రాలు:

#### 1. మనం గృహనిర్వాహకులం:

మొదటిగా, దేవుడు మనకు ఇచ్చిన వనరుల న్నిటి విషయమై మనం గృహనిర్వాహకులం. మనం గృహనిర్వాకులమే గానీ యజమానులం కాదు. కాబట్టి, దేవుడు మనకు అప్పగించిన వాటికి, డబ్బుతో సహా, మనం ఆయనకు మరలా తిరిగి లెక్క అప్పగి ంచాలి (కీర్తనలు 24:1; 50:10-11; హగ్గయి 2:8; యాకోబు 1:16-18; మత్తయి 25:14-30; లూకా 19:11-27). మనం మనకున్న వాటిని ఎలా ఖర్చుచేస్తున్నామని తెలుసుకోవడానికి ప్రభువు ఆసక్తిగా ఉన్నాడు. కాబట్టి "ఆర్థిక సంబంధమైన ప్రతి నిర్ణయం ఒక ఆధ్యాత్మిక నిర్ణయమే"[12]. నమ్మకమైన గృహనిర్వాహకులముగా మనం..

- ఎ) ధనవంతులవ్వడమే ధ్యాసగా జీవించకూడదు (సామెతలు 23:4-5; 1 తిమోతి 6:9-10)
- బి) డబ్బును తెలివిగా ఉపయోగించుకోవాలి (లూకా 16:1-12)
- సి) అపరిమితంగా ధనాన్ని కూడబెట్టకుండా, ఈ జీవనానికి సరిపోయినంత మొత్తాన్ని కూడబె ట్టుకోవాలి లేదా ఆదా చేసుకోవాలి (లూకా 12:13-21; 19:23; యాకోబు 5:1-3)
- డి) పొరుగువారివి ఆశించకూడదు లేదా స్నేహితులు, పొరుగువారి జీవనశైలిని అను-సరించి జీవించాలనే ధోరణి ఉండకూడదు (నిర్గమ 20:17)
- ఇ) భౌతిక లేదా వస్తు సంబంధమైన విషయాలకు కాకుండా ఆధ్యాత్మిక విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి (మత్తయి 6:33).

మనం దేవుని రాజ్యాన్ని, ఆయన నీతిని నిజంగా వెదికితే, అది మన దాతృత్వంలో కూడా ప్రతిబింబిస్తుంది. లోకం దృష్టిలో ధనవంతులుగా ఉండడం కన్నా దేవుని దృష్టిలో ధనవంతులుగా ఉండడం ఎంతో ఉత్తమం (లూకా 12:21). దేవుడు మిమ్మల్ని ఆర్థికంగా ఆశీర్వదించినప్పుడు ఆ ధనాన్ని దేవుని ప్రణాళికలు నెరవేర్చుటకు ఉపయోగించు (1 తిమోతి 6:17-19).

#### 2. దాతృత్వంలో మన ఆధ్యాత్మిక పరిపక్వత ప్రతిబింబిస్తుంది:

డబ్బును ఇవ్వడం అనేది మనల్ని మనం దేవునికి, ప్రభువుకు సమర్పించుకున్న దానికి ప్రతిఫలంగా ఉంటుంది (2 కొరింథీ 8:1-5). క్రొత్తనిబంధన ప్రకారం, ప్రతి క్రైస్తవుడు సంఘములో చురుకైన సభ్యునిగా ఉండాలని, పరిచర్యను జరిగించడానికి తన ఆర్థిక వనరులను సంఘంతో పంచుకోవాలని పరిపక్వత కలిగిన క్రైస్తవులు అర్థంచేసుకుంటారు (1 కొరింథీ 16:1-2). ప్రజలను ప్రభువు శిష్యులు గా చేయడానికి, ఆయన ప్రజలు తమ డబ్బును వెచ్చించాల్సి ఉంటుందని (1 కొరింథీ 9:7-14; 1 తిమోతి 5:17-18), తమ సమయాన్ని, శక్తి సామర్థ్యాలను, తలాంతులను మొదలగువాటిని సువార్త పరిచర్యలో వెచ్చించిన వారికే దాని నుండి జీవనోపాధిని పొందే హక్కును కలిగి ఉంటారనే విషయాలను కూడా వారు అర్థంచేసుకుంటారు. అనే దృష్టాంతాలతో పౌలు ఈ విషయాన్ని బలపరుస్తూ (1 కొరింథీ 8:1-18; 1 తిమోతి 5:17-18), ఈ విషయాన్ని ఇలా ముగించాడు: "ఆలాగున సువార్త ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించి ఉన్నాడు" (1 కొరింథీ 9:14). దీని అర్థం ఏమిటంటే, దేవుని పరిచర్యకు సమర్పించుకున్నవారి జీవనోపాధికై ఇతర విశ్వాసులు[13] ధన సహాయం చేయడం వారి బాధ్యత. ఎందుకంటే, వారు పిలువబడింది పరచర్య కోసమేగదా!

12. My wife Santhi and I understood this truth and agreed upon during the initial stages of our life together. We have been trying our best to be biblically spiritual in using our resources, particularly money. Even now, we are still learning to be more faithful to the commitment we made many years ago.

13. These Christians are also serving the Lord as His servants in their respective places of service like a corporate office, hospital, university, college, school, some industry, business establishment, etc. Their calling is to be there in those secular settings as witnesses. However, the difference is that they get their living from their work. In the end, all of us are getting our resources from the same source, that is God, the giver of all good gifts and we all with all that we have belong to Him.

### 3. మనం ఎంత ఇచ్చామన్నదికాదు, మనం ఇచ్చినదానికి, దాచుకున్నదానికి మధ్య వ్యత్యాసం ఎంత ఉన్నది? మనం ఏ దృక్పథంతో ఇచ్చాము అన్నదే ప్రాముఖ్యం:

క్రైస్తవ దాతృత్వంలో ఇది చాలా ముఖ్య విషయం. క్రైస్తవ దాతృత్వానికి, పాతనిబంధనలోని దశమభాగానికి మధ్య సంబంధం ఏమిటనే ప్రశ్న తరచూ ఎదురవుతుంది. ఈ విషయానికి సంబంధించి...

ఎ) దశమభాగం అన్నది (రాబడిలో 10%) ధర్మశాస్త్రానికి ముందు ఉన్న వాడుక (అదికాండం 14:17-24; 28:20-22; హెబ్రీ 7:1-10)

బి) దశమభాగం మోషే ధర్మశాస్త్రంలో అంతర్భాగం. యూదులు లేదా ఇశ్రాయేలీయులు తమ రాబడులన్నిటిలోనుండి దశమ భాగంగా తీస్తే సుమారు 30% పైనే అవుతుంది (లేవీ 27:30-32; సంఖ్యా 18:26-29; మలాకీ 3:812)

సి) యేసుక్రీస్తు దశమ భాగానికి వ్యతిరేకంగా ఎన్నడూ బోధించలేదు. దాన్ని వక్రీకరించ కూడదు, దాన్ని ఒక చట్టపరమైన అంశంగా చూడకూడదు, దాన్ని దుర్వినియోగం చేయకూడదు అనే ఆయన బోధించాడు (లూకా 11:42; 18:9-14).

వీటన్నిటి విషయాల ఆధారంగా మనం తెల ుసు కోవాల్సింది ఏంటంటే, క్రైస్తవులు దశమభాగం ఇవ్వడంలో తప్పులేదు (అది కనీస స్థాయి, గరిష్ఠస్థాయి కాదు). అయితే, ఆ విషయాన్ని ఒక చట్టంగా మార్చకూడదు. ప్రతి క్రైస్తవుడు లేదా క్రైస్తవ కుటుంబము ఎంత శాతం దేవునికి ఇవ్వాలి? మిగతాది వాక్యానుసారంగా ఎలా ఉపయోగించుకోవాలి అని ఆలోచించుకోవాలి.

#### దశమభాగం అంతా స్థానిక సంఘంలోనే ఇవ్వాలా?

ప్రభువుకు సమర్పించినదంతా స్థానిక సంఘానికి ఇవ్వొచ్చు లేదా ఇతర పరచర్యలకు నిర్దిష్టంగా, తగిన రీతిలో కేటాయించుకోవాలి. సంఘము, సంఘ సేవకులు, అవసరతలో ఉన్న, పేదవారైన సహవిశ్వాసుల అవసరాలు తీర్చే బాధ్యతాయుతమైన సంఘ సభ్యులుగా మనం ఉండేటట్లు జాగ్రత్త వహించాలి. దశమభాగం అంతా స్థానిక సంఘములోనే ఇవ్వాలి అనే విషయానికి ఎలాంటి బైబిల్ ఆధారం లేదు. స్థానిక సంఘ అవసరాలు తీరిన తర్వాత, నమ్మకంగా సేవచేస్తూ అవసరతలో ఉన్న దేవుని పరిచర్య సంస్థలకు, పరిచారకులకు ఇవ్వడం సంపూర్ణ అంగీకారమైన విషయం. ఎందుకంటే, ఇవన్నీ ప్రభువుకు ఇచ్చినదానితో సమానం. అంతేకాదు, ఇలా ఇవ్వడం నమ్మకమైన గృహనిర్వాహకత్వానికి ఒక గుర్తు. కొన్ని సార్లు స్థానిక సంఘానికి అవసరాలకు మించిన డబ్బు ఉంటుంది. కానీ నమ్మకంగా పరిచర్య చేస్తూ అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిచారకులు, పరిచర్యలు, పరిచర్యలేని ప్రాంతాలలో పరిచర్యను చేస్తున్న అనేక సంఘాలు ఉన్నాయి.

#### బి) బైబిల్ ఆధారిత క్రైస్తవ దాతృత్వానికి సంబంధించిన కొన్ని ఆచరణాత్మక సూచనలు:

"విత్తడం, కోయడం" అనే సూత్రాన్ని మనం జ్ఞాపకం చేసుకోవాలి. ఆర్థిక విషయాలు కూడా ఈ సూత్రం పరిధిలోకే వస్తాయి. "అతడు వెదజల్లి దరిద్రులకిచ్చెను, అతని నీతి నిరంతరము నిలుచును" (2 కొరింథీ 9:6). ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకొని పౌలు బోధ ఆధారంగా కొన్ని ఆచరణాత్మక సూచనల ను తెలుసుకుందాము (2 కొరింథీ 8-9; మత్తయి 6:1-6; 1 కొరింథీ 16:1-2).

- ❀ మన ఆదాయానికి అనుగుణంగా లేదా ప్రభువు మనల్ని ఆశీర్వదించిన కొలది ఇవ్వాలి.
- ❀ క్రమంగా, ఇష్టపూర్వకంగా, సంతోషంగా ఇవ్వాలి.
- ❀ త్యాగపూరితంగా, కృతజ్ఞతా పూర్వకంగా, ధారాళంగా, ఉద్దేశపూర్వకంగా ఇవ్వాలి.
- ❀ రహస్యంగా ఇవ్వాలి. మనుష్యుల మెప్పును ఆశించి ఇవ్వకూడదు. దేవుని కోసం ఇవ్వాలి.

#### ఆటంకాలు:

మన దాతృత్వం బైబిల్ ఆధారమైనదిగా ఉండాలంటే పరిశుద్ధాత్మ దేవుని సహాయంతో మన దాతృత్వానికి ఎదురయ్యే ఆటంకాలను అధిగమించాలి (మత్తయి 6:24-34; మార్కు 4:19; లూకా 12:13-21; 16:13-15; 1 తిమోతి 6:3-10,19; హెబ్రీ 13:5).

- స్వార్థము, ధనాపేక్ష
- ఏమీ మిగలదేమోనన్న భయం, దేవుని మీద విశ్వాసం లేకపోవడం
- దేవుని పట్ల ప్రేమ లేకపోవడం
- లోకానుసారమైన మనస్సు, వస్తువుల పట్ల మోజు
- ఆర్థిక విషయాలలో తెలివితక్కువ నిర్ణయాలు తీసుకోవడం, డబ్బును సరిగా వినియోగించు కోలేకపోవడం, ఫలితంగా అప్పులు ఎక్కువగా చేయడం
- ఖరీదైన జీవనశైలిని అనుకరించడం (మన చుట్టూ ఉన్నవారి ప్రభావానికి మనం లోనైనప్పుడు ఇలా జరుగుతుంది)

### ముగింపు:

ప్రేమపూర్వక దాతృత్వాన్ని అభ్యాసం చేయడమంటే, ప్రేమ పూర్వక దాతృత్వం కలిగిన మన దేవుని పోలి జీవించడమే. మన జీవితంలోని ప్రతి విషయంలో (దాతృత్వంలోకూడా) క్రీస్తును పోలిన జీవితంలోనికి మారుటే పరిశుద్ధపరచబడటం యొక్క సారాంశం (రోమా 8:29; 1 యోహాను 2:6; 2 కొరింథీ 3:18). కాబట్టి, మనం క్రైస్తవ జీవితంలో ఎదుగుతున్నామంటే ఆ ఎదుగుదల మన సమయం, తలాంతులు, ధనములను దేవునికి, దేవుని పరిచర్యకు ఇచ్చేవిషయంలో కూడా కనిపించాలి. దాతృత్వంలో మనం ఎదుగులాగున (2 కొరింథీ 8:7) తద్వారా మనం ఆయన్ను పోలి ఉండులాగున ప్రభువు మనకు సహాయం చేయునుగాక! జీవితానికి సంబంధించిన విషయాలలో బైబిల్ ఆధారిత ఆలోచనా విధానాన్ని మనం అలవర్చుకుంటే, ఈ లోకాన్ని విడిచినప్పుడు మనం ఏమీ తీసుకుపోలేమని అర్థం చేసుకుంటాము. దేవుని పరిచర్య అభివృద్ధి చెందడానికి, మన కుటుంబ అవసరాలు తీరడానికి మనం మన వనరులను ఉపయోగించుకున్నట్లు ఈ అవగాహన మనకు సహాయం చేస్తుంది (లూకా 12:20,21; యోబు 1:20,21; ప్రసంగి 5:15). దేవుడు మనకు ఇచ్చినదాన్ని ఎలా ఉపయోగిస్తున్నామనేది, మన మనస్సు దేని మీద ఉన్నది, మనం దేనికి విలువ ఇస్తున్నాము అనే విషయాలను తెలియజేస్తుంది. డబ్బు, వస్తువులు అనేవి తటస్థ అంశాలు. వాటిపట్ల మన దృక్పథం ఎలా ఉన్నది, వాటిని మనం ఎలా ఉపయోగిస్తున్నాము అనేది మన నిజ ఆత్మీయ స్థితిని ప్రతిబింబింప చేస్తాయి. మన వనరులు, ముఖ్యంగా డబ్బును, వస్తువులను ఉపయోగించే విషయంలో వాక్యానుసారమైన దృక్పథాన్ని మరి ఎక్కువగా కలిగి ఉండేవిధంగా, వాటిని సేవకుల, సేవా అవసరాల ను తీర్చుటకు ఉపయోగించునట్లు ప్రభువు మనకు సహాయం చేయునుగాక! **– సమాప్తం**

**– యం. సుధాకర్ (డైరక్టర్) మరియు**
**యం. శాంతకుమారి (అకడమిక్ డీన్)**
హైదరాబాద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ థియాలజీ అండ్ అపాలజిటిక్స్ (హిత), హైదరాబాద్

## రాణించడానికి 5 సూత్రాలు

**1. దీనత్వము:** దీనత్వం లేకపోతే రాణించలేము. దేవుని కృప ద్వారా, క్రీస్తు ప్రభువుకు అతీతంగా మనమేమీ చేయలేమనే గ్రహింపు ద్వారా మాత్రమే రాణించే క్రమంలో మనము విజయం సాధిస్తాము.

**2. కాలక్రమేణా అభివృద్ధి చెందడం:** రాణించడం అనేది ప్రతి చిన్న విషయంపైన ఆధారపడి ఉంటుంది. చిన్నచిన్న విషయాలలో కూడా నీవు ప్రతిరోజు అభివృద్ధి చేసుకొంటూ ఉంటే రాణించడం సాధ్యమౌతుంది. ఆచరణలో పెట్టడమనేదానిపైనే ఇదంతా ఆధారపడి ఉన్నది. రాణించాలని ప్రణాళికవేసుకో. ఆ ప్రణాళికను ఆచరణలో పెట్టుటకు తగిన జాగ్రత్తలన్నీ తీసుకో.

**3. జాగ్రత్తగా విచారించాలి:** రాణించే క్రమంలో అన్నిటినీ జాగ్రత్తగా పరీక్షించినప్పుడే సరైన నిర్ణయాలు తీసుకొని అర్థమైన విషయాలపైనే దృష్టిపెట్టగలవు.

**4. సంపూర్ణత:** 'రాణించడం అనేది నైపుణ్యం కాదు, అదొక దృక్పథం' అని రాల్ఫ్ మార్ట్సన్ అన్నాడు. నిజమైన రాణింపు అంటే మీరు ఏమి చేసినా ప్రభువు నిమిత్తమై మనస్ఫూర్తిగా, సంపూర్ణంగా చేయడమే.

**5. ఎవరితోనూ పోల్చలేనిది:** రాణించడాన్ని ఇతరులతో పోల్చలేనిది. కానీ రాణించిన వ్యక్తుల ప్రదర్శన, కృషి ఇతరులకు మాదిరిగా ఉంటుంది. నీ రాణింపును ఇతరుల రాణింపుతో పోల్చడానికి ప్రయత్నించకు. గతంలో నీ స్థితి, ఇప్పటి నీ స్థితిని పోల్చుకొని, నీ ఎదుగుదల ఎలా ఉన్నదో పరీక్షించుకో. దేవుడు పరీక్షించేది మన పంటను కాదు, మన విత్తనాన్ని.

**– విజె డెస్క్**

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-12-2025**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Vidyardhi Jwala is published by Mr. Ravipalli Srinivasa Rao, from # 19-37, Abhishek Nagar, Nambur - 522 508, Guntur District, Andhra Pradesh on behalf of Union of Evangelical Students of India (UESI) edited by Mr. Pilli Sunil Jacob and printed by Mr. Bhashyam Hanumantha Rao at Bhashyam Publishers, Plot No. B2, Ind. Estate, Backside of Bajaj Showroom, Amaravati Road Guntur 522 034, Guntur District, Andhra Pradesh

# జీవితం అల్పమైనది



జీవితం అల్పమైనది!
అల్పమైన రోజులు స్వల్పమైన సంవత్సరాలు
గడిచిపోతున్న గంటలు పరుగులు తీస్తోన్న నిమిషాలు
ఇంతలో అభివందనం చేస్తాయి
అంతలో వీడ్కోలు పలుకుతాయి
జీవితకాలం ఎంతగా కుదించబడింది!

జీవితంలో ఎదురొచ్చేవన్నీ అల్పమైనవే!
ఆశలు అవకాశాలు ఆనందాలు అనురాగాలు
అన్నీ ఇంతలో ముందుకొచ్చి అంతలో మాయమయ్యేవే
ప్రతి నిమిషం నిత్యత్వంతో ముడిపడి ఉండేదే
ఈ జీవితంలో అన్నీ అల్పమైనవే
మనకు కనిపించేవన్నీ స్వల్పమైనవే!

జీవితంలో ప్రత్యామ్నాయాలు ఎన్నో, ఎన్నెన్నో!
కాని, అవన్నీ కేవలం అల్పమైనవే స్వల్పమైనవే
నువ్వు వేసే ప్రతి అడుగునూ ఆయన గమనిస్తున్నాడు
నీ ప్రతి పనినీ ఆయన తన గ్రంథంలో లిఖిస్తున్నాడు
తనకోసం చేసే ప్రతి పనికీ నీకు నిత్యమైన బహుమానం
జీవితంలో ప్రత్యామ్నాయాలు ఎన్నో ఎన్నెన్నో!

కాని, అల్పంగా కనిపించేవన్నీ స్వల్పమైనవి కావు!
నిత్యమైన పంటకోసం విత్తబడే విత్తనాలే అవన్నీ
నిత్యమైన ఆనందాన్ని అందుకొనే అవకాశాలే అవన్నీ
వెయ్యింతల ఆశీర్వాదాల్ని అందించే అనుభవాలే అవన్నీ
నువ్వు చేసే ప్రతి మంచిపనీ వెలకట్టలేనంత విలువైనదే
నీకు అల్పంగా కనిపించేవన్నీ స్వల్పమైనవి కావు!

దేవుని కోసం నువ్వు పడే కష్టాలు నష్టాలు కావు!
ఆయన కోసం జీవించే జీవితం ఎన్నటికీ నష్టాన్నివ్వదు
ఆయన కోసం నువ్వు ఖర్చు చేసే నీ సమయం
ఆయన పేరిట దరిద్రులకు నువ్వు చేసే దానధర్మాలు
ఆయన కోసం నువ్వు పడే శ్రమలు ప్రయాసలు
అన్నీ పరలోక పట్టణంకోసం నువ్వు పెట్టే పెట్టుబడులే!

– వెస్లీ. యల్. డ్యూవెల్